రైతుబీమా ప్రొసీడింగ్ అందజేత



నవతెలంగాణ-గుమ్మడిదల

గుమ్మడిదల మండలం బొంతపల్లి గ్రామానికి చెందిన ఆలేటి శ్రీనివాసరెడ్డి వివిధ కారణాల రీత్యా మృతి చెందారు. అతని కుటుంబానికి రైతు బీమా ఐదు లక్షల ప్రొసీడింగ్‌ను నామినీ అతని భార్య శ్యామలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రైతుబీమా రూ.5 లక్షల ప్రొసీడింగ్‌ను ఎంపీపీ సద్ది ప్రవీణ విజయభాస్కర్ రెడ్డి, జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, మండలరైతు బంధు అధ్యక్షులు పొచుగారి సంజీవరెడ్డి, సర్పంచ్ ఆలేటి నవీన శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ నాగేందర్ గౌడ్ చేతుల మీదుగా శుక్రవారం అందజేశారు. కార్యక్రమలో మండల వ్యవసాయ అధికారి డి శ్రీనివాసరావు ఏఈఓ రమేష్ బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ హుస్సేన్ పంచాయతీ పాలకవర్గం సభ్యులు, నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ 1



మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

శనివారం 28 జనవరి 2023





సీనియర్ ఫొటో జర్నలిస్ట్ మురళి, కృష్ణలకు అవార్డు

నవతెలంగాణ-సంగారెడ్డి: సీనియర్ ఫొటోజర్నలిస్టు మురళి, కృష్ణలకు ఫొటోగ్రఫీలో చూపించిన ప్రతిభకుగాను జిల్లా కలెక్టర్ శరత్ అవార్డులను అందజేశారు. 74వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ జిల్లా కలెక్టర్ శరత్ ఫొటోజర్నలిస్టులకు అవార్డుతో పాటు ప్రసంశా పత్రాన్ని అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా మురళి, కృష్ణ మాట్లాడుతూ ఫొటోజర్నలిస్టుగా పనిచేస్తూ ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు.



ఆటల కోసం క్రీడా ప్రాంగణాలు

- గ్రామ పంచాయతీలకు నిర్వహణ బాధ్యత
- వసతుల కల్పన కూడా చూడాలి
- క్రీడలు, క్రీడాకారులకు మరింత ప్రోత్సాహం
- దాతలు, యువజన సంఘాల పాత్రను పెంచితే ఫలితాలు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధృఢత్వానికి దోహద పడతాయి. క్రీడా స్ఫూర్తిని పెంచడం, క్రీడల్ని ప్రోత్సహించడం అనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీలో క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేసింది. స్థలాల లభ్యతను బట్టి మధిర గ్రామాల్లో కూడా క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. ఇంత వరకు బాగనే ఉన్నా నిర్వహణ బాధ్యతను వదిలేశారు. నిరుపయోగంగా ఉన్న క్రీడా ప్రాంగణాలను క్రీడలకు ఉపయోగపడేలా ఉంచాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇటీవల వాటి నిర్వహణ బాధ్యతను గ్రామ పంచాయతీలకు అప్పజెప్పింది. ఇకనైనా ఆటలాడేందుకు వీలుగా ప్రాంగణాల నిర్వహణ చేయాలని యువజన సంఘాలు కోరుతున్నాయి.

క్రీడలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. సంగారెడ్డి జిల్లాలో 647 గ్రామ పంచాయతీలు, 96 మధిర గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. సిద్దిపేట జిల్లాలో 499 గ్రామ పంచాయతీలు, 67 మధిర గ్రామాల్లో మెదక్ జిల్లాలో 469 గ్రామ పంచాయతీలు, 60 మధిర గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. ఒక క్రీడా ప్రాంగణం ఎకరం స్థలంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆ మేరకు స్థలం లభించకపోవడంతో 80 శాతం క్రీడా ప్రాంగణాలు అరెకరం స్థలంలోనే ఏర్పాటు చేశారు. కొన్ని చోట్ల ఊరి సమీపంలో స్థలాల్లేకపోవడంతో దూరంగా ఏర్పాటు చేశారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రతి గ్రామంలోనూ క్రీడా ప్రాంగణాలున్నాయి. విద్యార్థులు, యువజనులు వాలీబాల్, టెన్నిస్, కబడీ, రింగ్‌బాల్, క్రికెట్ పట్ల ఆసక్తి చూపుతారు. స్థానికంగా ఆటస్థలాల్లేక ఆటలు ఆడుకోలేకపోతున్నారు. పోలీస్ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే యువకులకు కూడా క్రీడా ప్రాంగణాలు ఉపయోగపడతాయి.

నిర్వహణ గ్రామ పంచాయతీల బాధ్యత

క్రీడా ప్రాంగణాల ఉద్దేశం నెరవేరేందుకు వీలుగా వాటి నిర్వహణ బాధ్యతల్ని గ్రామ పంచాయతీలకు అప్పజెప్పారు. నూతన పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ఆదర్శ గ్రామ పంచాయతీలుగా మారాలంటే క్రీడా ప్రాంగణాలను విధిగా నిర్వహించాలి. అందు కోసమే 2022 డిసెంబర్ 24న రాష్ట్ర ప్రభుత్వం క్రీడా ప్రాంగణాల నిర్వహణను గ్రామ పంచాయతీలే చూసుకోవాలని జీవో జారీ చేసింది. ఈ జీవో ప్రకారం క్రీడా ప్రాంగణాలు క్రీడాకారులకు ఉపయోగపడేలా ఆటలు ఆడేలా చూడాల్సిన పని పంచాయతీలపై ఉంది. క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసిన తర్వాత వాటి నిర్వహణను ఎవరూ పట్టించుకోలేదు. ప్రారంభంలో గ్రౌండ్ చదును చేసి ఆటలకు వీలుగా సిద్ధం చేసి ప్రారంభించారు. తర్వాత వర్షాలు కురియడంతో చెట్లు పెరిగాయి. ఆడుకునేందకు వీల్లేకుండా మారాయి. వాటిని రెగ్యులర్‌గా శుభ్రం చేయడం, ఆటలు ఆడేందకు అవసరమైన కోర్టుల ఏర్పాటు, తాగునీరు, లైట్లు, క్రీడా సామాగ్రి వంటి వసతులు కూడా కల్పించాలి. అందుకు గ్రామ పంచాయతీలు యువజన సంఘాలు, క్రీడాకారులు, దాతలు, ఫిజికల్ డైరెక్టర్ల సహకారంతో క్రీడా ప్రాంగణాలను మరింత ఉపయోగకరంగా తీర్చిదిద్దాల్సి ఉంది. గ్రామం, స్కూల్స్ దూరంగా కొన్ని క్రీడా ప్రాంగణాలున్నాయి. అక్కడికెళ్లి ఆటలు ఆడుకోవడం ఇబ్బందిగా ఉందని యుజవన సంఘాలు, క్రీడా కారులంటున్నారు.

క్రీడా సామాగ్రి, వసతులు సమకూర్చాలి



క్రీడా ప్రాంగణాల్లో వసతులు, క్రీడా సామాగ్రి సమకూర్చాలి. యువజన సంఘాలు, దాతలు, క్రీడా నైపుణ్యం కల్గిన శిక్షకుల సహకారం తీసుకోవాలి. అందరి భాగస్వామ్యంతో క్రీడా ప్రాంగణాల్ని తీర్చిదిద్దాలి. గ్రామ పంచాయతీలకు అప్పజెప్పిడం మంచిది. ఇకనైనా ఆటలు ఆడేందుకు వీలుగా నిర్వహించాలి. గ్రామ, పట్టణ స్థాయిలో క్రీడాకారుల్ని ప్రోత్సహించడం ద్వారానే మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించే అవకాశముంటది. యువజన సంఘాల నిర్వహించే క్రీడాపోటీలకు గ్రౌండ్స్ లేక స్కూల్స్ ఏరియా, వెంచర్స్ ఖాళీ స్థలాల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. క్రీడా ప్రాంగణాలను ఉపయోగించుకునేలా గ్రామ సర్పంచులు, కార్యదర్శులు బాధ్యత తీసుకోవాలి.

- అనిల్, డీవైఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి

ఉత్తర్వులు అమలు చేస్తం

ప్రభుత్వ ఉత్తర్వుల్ని అమలు చేస్తం. గ్రామ పంచాయతీలు క్రీడా ప్రాంగణాల్ని నిర్వహించేలా చర్యలు తీసుకుంటాం. ప్రజలకు, క్రీడాకారులకు అవసరమైన వసతుల కల్పనకు కూడా చర్యలు తీసుకుంటాం. ఆదర్శ గ్రామ పంచాయతీల ఎంపికలో క్రీడా ప్రాంగణాల నిర్వహణ కూడా కీలకాంశమే.

- సురేష్‌మోహన్, డీపీఓ, సంగారెడ్డి



అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు

నవతెలంగాణ-జోగిపేట

అంగన్వాడీల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని, అంగన్వాడీ ఉద్యోగులకు పని భారం తగ్గించి కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు అన్నారు. శుక్రవారం జోగిపేటలోని సీడీపీవో కార్యాలయం ముందు అంగన్వాడీ కార్యకర్తలతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 40 సంవత్సరాలకుపైగా ఐసీడీఎస్‌లో పని పలు సేవలు అందిస్తున్నా వీరికి కనీస వేతనం, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించడం లేదన్నారు. తమిళనాడు, పాండిచ్చేరి, కర్ణాటక, కేరళ తదితర రాష్ట్రాల్లో అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులు గుర్తించారని, మన రాష్ట్రంలో గుర్తించకపోవడం చాలా దుర్మార్గమన్నారు. 1972 గ్రాట్యుటీ చట్టం అమలు చేయాలని సుప్రీంకోర్టుకు చెప్పినా తెలంగాణ రాష్ట్రం అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. సీఎం కేసీఆర్ హామీ ఇచ్చినా కలగానే మిగిలిందన్నారు. తక్షణమే అంగన్వాడీలకు రిటర్మెంట్ బెనిఫిట్స్, టీచర్లకు రూ.ఐదు లక్షలు, హెల్పర్లకు రూ.3 లక్షలు ఇవ్వాలన్నారు. 2017 నుంచి ఇప్పటివరకు టీఏడీఏలు, ఇంక్రిమెంటు, ఇన్చార్జ్ అలవెన్స్ చెల్లించడంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ అందోల్ డివిజన్ నాయకులు డి.విద్యాసాగర్, అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి మంగమ్మ నాయకురాలు, అరుణ, షేకమ్మ, స్వరూప, సావిత్రి, తుల్జమ్మ, సరల, మేఘమాల, ప్రమీల, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-పటాన్‌చెరు: అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ విషయంపై మార్చి 1, 2, 3వ తేదీలలో రాష్ట్ర వ్యాప్త సమ్మె చేపడతామని హెచ్చరించారు. అంగన్వాడీ టీచర్ల, ఆయాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం సీడీపీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం సీడీపీఓ చంద్రకళకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ అంగన్వాడీ రంగంలో ఉన్న పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. గత 30 సంవత్సరాలుగా ఐసీడీఎస్‌లో పని చేస్తున్న సిబ్బందికి కనీస వేతనం, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించకపోవడం దారుణమన్నారు. తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాల్లో ప్రబుత్వ ఉద్యోగులుగా గుర్తించారన్నారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలో హెల్త్ కార్డులు ఇచ్చారని గుర్తు చేశారు. పశ్చిమ బెంగాల్, కేరళలో రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్, పండుగ బోనస్ ఇస్తున్నారన్నారు. మన రాష్ట్రంలో ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. 2022లో అంగన్వాడీలకు మే నెలలో 1972 చట్టం ప్రకారం గ్రాట్యుటీ వర్తింపజేయాలని సుప్రీం కోర్టు జడ్జిమెంట్ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం తుంగలో తొక్కిందన్నారు. 2017 నుంచి 199 మంది టీచర్ల టీఏడీఏలు రూ.కోటి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఎన్‌హెచ్‌టీఎస్ ఆప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీచర్లు విటలమ్మ, రాణి, జమున, సునీత, శమాదేవి, మంజుల, గాయత్రి ,ప్రమీల, ఇందిర పాల్గొన్నారు.

నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్: సిద్దిపేటలో అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పద్మ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా చేశారు. అనంతరం ఐసీడీఎస్ సీడీపీవోకు వినతిపత్రం అందజేశారు.

నవ తెలంగాణ-దుబ్బాక: సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రాష్ట్రంలోని అంగన్వాడీ ఉద్యోగులకు గ్రాట్యుటీ చెల్లించాలని, వేతనంలో సగం పెన్షన్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం దుబ్బాక ఐసీడీఎస్ ఆఫీసు ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా కోశాధికారి జి.భాస్కర్ మాట్లాడుతూ టీచర్లతో సమానంగా అంగన్వాడీ ఉద్యోగులకు వేతనం, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. 2018 అక్టోబర్లో కేంద్రం పెంచిన వేతనం అంగన్వాడీ టీచర్లకు రూ.1,500, హెల్పర్లకు రూ.750,మినీ వర్కర్లకు రూ.1,250 రాష్ట్ర ప్రభుత్వం ఎరియర్స్తో సహా చెల్లించాలన్నారు. తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షురాలు ఎస్ లక్ష్మీ మాట్లాడుతూ అంగన్‌వాడీలలో ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. అంగన్వాడీ ఉద్యోగులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. అంగన్వాడీ టీచర్లు విజయ, సురేఖ, లక్ష్మి, బాలమణి, భాగ్యలక్ష్మి, స్వరూప, యాదమ్మ, మమత, కనకధార, జ్యోతి తదితరులు ఉన్నారు.







నవతెలంగాణ-నారాయణఖేడ్

అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం నారాయణఖేడ్ సీడీపీవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఐసీడీఎస్ సీడీపీవో సుజాతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు చిరంజీవి మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు వీనాకుమారి, సుశీల, స్వరూప, లక్ష్మి, భాగ్య మంజుల, శశికళ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు రాష్ట్ర బడ్జెట్లో 5 శాతం నిధులు కేటాయించాలి

- ఆసరా పెన్షన్లకు ఆదాయ పరిమితి విధించే జీవో 17ను రద్దు చేయాలి
- ఈ నెల 30న కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు
- ఎన్‌పీఆర్డీ రాష్ట్ర కార్యదర్శి అడివయ్య



నవ తెలంగాణ-మెదక్ టౌన్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న రాష్ట్ర బడ్జెట్లో వికలాంగులకు 5 శాతం నిధులు కేటాయించాలని, ఆసరా పెన్షన్లకు ఆదాయ పరిమితి విధించే జీవో 17ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 30న కలెక్టరేట్ల ముందు ధర్నాలు నిర్వహిస్తున్నామని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి అడివయ్య తెలిపారు. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక మెదక్ జిల్లా కమిటీ సమావేశం ఈరోజు పట్టణంలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గత ఎనిమిది సంవత్సరాలుగా ప్రవేశపెట్టిన బడ్జెట్లలో వికలాంగుల సంక్షేమం కోసం నిధులు కేటాయించడం లేదన్నారు. 'ఆసరా పింఛన్ల మంజూరుకు ఆదయ పరిమితి విధిస్తూ 2014 సంవత్సరంలో జీవో నెంబర్ 17 విడుదల చేసింది ఈ జీవోను 2022 అక్టోబర్ నుండి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం ద్వారా అర్హులైన అనేకమంది లబ్ధిదారుల పింఛన్లు రద్దు అయినవి ప్రభుత్వ నిర్ణయం ద్వారా పెన్షన్ల మీద ఆధారపడిన వికలాంగులు వద్దులు ఒంటరి మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత నాలుగు నెలల నుండి రద్దు చేసిన అర్హులైన వారి పింఛన్లను వెంటనే పునరుద్ధరించాలి. వికలాంగుల వివాహ ప్రోత్సాహం వేలాది దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయి. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లకు నిధులు విడుదల చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం వికలాంగుల వివాహ ప్రోత్సాహనికి మాత్రం ఎందుకు నిధులు విడుదల చేయడం లేదు. తక్షణమే నిధులు విడుదల చేసి దరఖాస్తు చేసిన వారందరికీ వివాహ ప్రోత్సాహకాన్ని మంజూరు చేయాలి. 2020-21, 2021-2022, ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నప్పటికీ స్వయం ఉపాధి కోసం దరఖాస్తు చేసుకున్న వారికి రుణాలు మంజూరు చేయడం లేదు. బ్యాంకు లింకేజి లేని రూ.50 వేల రుణాలను మాత్రమే పంపిణీ చేసి, బ్యాంకు లింక్ చేసిన రుణాలను మంజూరు చేయడం లేదు. దరఖాస్తు చేసుకున్న వేలాది మంది లబ్దిదారులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. అధికారుల నిర్లక్ష్యం వలన నిరుద్యోగ వికలాంగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆసరా పెన్షన్లు ప్రతి నెల మొదటి వారంలోని చెల్లించాల్సి ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ప్రతి నెలా సక్రమంగా చెల్లించకపోవడం ద్వారా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆసరా పింఛన్లకు అవసరమైన నిధుల్ని ముందే విడుదల చేస్తున్నామని ప్రభుత్వం ఒకవైపు చెపుతుంటే మరోవైపు నెలల తరబడి పెండింగ్లో ఎందుకు ఉంటున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రతి నెల సకాలంలో ఆసర పింఛన్లు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలి. చదువుతో నిమిత్తం లేకుండా వైకల్య తీవ్రతను బట్టి దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి మోటార్ వెహికల్స్ ఇవ్వాలి. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక టీచర్లను నియమించే విధంగా చర్యలు తీసుకోవాలి. 2016 వికలాంగుల హక్కుల పరిరక్షిత చట్టం గుర్తించిన 21 రకాల వైకల్యాలకు ధ్రువీకరణ పత్రాలను తక్షణమే మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి. ఆటిజం, సెరిబ్రల్ పాల్సి, క్లినికల్ న్యూరోలసికల్ సమస్యలతో బాధపడుతున్న వారి కోసం ప్రభుత్వమే ఉచితంగా వైద్యం అందించే విధంగా చర్యలు చేపట్టాలి' అని అన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు కె యశోద, జిల్లా గౌరవ అధ్యక్షులు బస్వరాజు మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న వికలాంగులైన ఉద్యోగులకు ప్రమోషన్లు, రిజర్వేషన్లు సక్రమంగా అమలు చేయకపోవడం ద్వారా తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని తెలిపారు. స్వయం ఉపాధి కోసం దరఖాస్తు చేసుకున్న వారికి అవసరమైన రుణాలు ఎందుకు మంజూరు చేయడం లేదని ప్రశ్నించారు. రేషన్ డీలర్ నియామకాల్లో వికలాంగులకు ఐదు శాతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు దుర్గ, కవిత, జిల్లా ఉపాధ్యక్షులు అగమయ్య, చంద్రం, గుమ్మడీదల శ్రీనివాస్, సహాయ కార్యదర్శి శ్రీనివాస్, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

కంటివెలుగును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి













- జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

నవ తెలంగాణ-కొమురవెల్లి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడత కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ సూచించారు. మండలంలోని ఐనాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని శుక్రవారం ఆయన జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి కాశినాథ్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 18 ఏళ్ల నిండిన వారందరూ కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. కంటి పరీక్షల కోసం వచ్చిన వారిని కలెక్టర్ ఆప్యాయంగా పలకరించారు. శిబిరం వద్ద అందుబాటులో ఉన్న సౌకర్యాలు పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. శిబిరాలకు వచ్చే వారికి మెరుగైన సేవలందించాలని, శస్త్ర చికిత్స అవసరం ఉన్న వారి వివరాలు రిజిస్టర్‌లో పొందుపరచాలని సూచించారు. గ్రామ సర్పంచ్ చెరుకు రమణా రెడ్డి , ఎంపీడీవో అనురాధ వైస్ ఎంపీపీ, కాయిత రాజేందర్ రెడ్డి,ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నవతెలంగాణ-బెజ్జంకి : మండల కేంద్రంలోని స్థానిక బాలికల,బేగంపేట ప్రభుత్వోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాలను శుక్రవారం జెడ్పీ సీఈఓ రమేశ్, డీఎల్పీఓ రాజీవ్ కూమార్ సందర్శించి పరిశీలించారు. అనంతరం అయా పాఠశాలల్లోని పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. రాబోయే పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాదించాలని సూచించారు. సర్పంచులు ద్యావనపల్లి మంజుల,సంజీవ రెడ్డి,ఎంపీడీఓ రాము, వైద్యాధికారి వినోద్ బాబ్జీ, ఎస్ఎంసీ చైర్మన్ శంకర్,వార్డ్ సభ్యులు,పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నవ తెలంగాణ-దౌల్తాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అధిష్టాంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ నాగరాజు అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాన్ని ప్రతి గడపకూ చెప్పాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ కొండపాక : కంటివెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ యాదవ రెడ్డి తెలిపారు. జరుగుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ ఆరోగ్యంగా ఉండాలని సీఎం కేసీఆర్, మంత్రి హరీష్ రావు ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించి అమలు చేస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో జరుగుతున్న శిబిరాల్లో కంటి పరీక్షలు చేపించుకోవాలని తెలిపారు. పిఎస్ఆర్ సంస్థ అధినేత పోల్కంపల్లి నరేందర్ ఐకెపి ఎపిఎం శ్రీనివాస్ పంచాయతీ కార్యదర్శి మమత ఉన్నారు.

నవతెలంగాణ-రాయపోల్: రాష్ట్ర ప్రజలకు ఎలాంటి దృష్టిలోపం లేకుండా ఆరోగ్యం వంతమైన కంటి చూపు కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించామని, ఈ వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సిద్దిపేట జిల్లా మహిళ సమాఖ అధ్యక్షురాలు స్వాతి, ఎంపీడీవో మున్నయ్య అన్నారు. శుక్రవారం కంటి వెలుగు, మండల మహిళా సమాఖ్య వివోఏల సమావేశాలకు వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమం 18 సంవత్సరాలు పైబడిన వారందరూ కంటి పరీక్షలు చేపించుకోవాలని సూచించారు. ప్రభుత్వమే ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వడంతోపాటు కంటి అద్దాలు కూడా పంపించేస్తుందన్నారు. గ్రామాలలో వివోఏలు మహిళ సంఘాలలో ఉండే మహిళలకు జీవనోపాధి కోసం రుణాలు ఇప్పించాలని మహిళ సాధికారత కోసం కృషి చేస్తూ, మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడం కోసం కలిసికట్టుగా పనిచేద్దామన్నారు. అనంతరం మొదటిసారిగా మండల మహిళ సమాఖ్య వివోఎలా సమావేశానికి హాజరైన ఎంపీడీవో, ఎంపీఓ, జిల్లా సమైక్య అధ్యక్షురాలకు శాలువాతో సన్మానించి సత్కరించారు. ఏపీఎం దుర్గాప్రసాద్,ఎంపీఓ లక్ష్మీనారాయణ, సీసీలు కిష్టయ్య ,రవీందర్, నాగరాజు, ప్రవీణ్ ,రోజా ,వివోఏలు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కల్హేర్ : రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిజాంపేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ రాహుల్ చౌహన్ కోరారు. శుక్రవారం నిజాంపేట్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అర్బన్ సబ్ సెంటర్ బస్తి దవాఖానలో ఏర్పాటు చేసిన రెండో విడత కంటి వెలుగు శిబిరాన్ని డివిజన్ ఇంచార్జ్ జట్ల భాస్కర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం కంటి వెలుగు శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి కంటి అద్దాలను అందజేశారు. ఫిబ్రవరి 3 వరకు ఈ శిబిరం కొనసాగుతుందన్నారు. అందరూ ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో క్యాంపు మెడికల్ ఆఫీసర్ అఖిల, కంటి వెలుగు ఇంచార్జ్ ఎంపిహెచ్ఏ మెయిల్ జట్ల భాస్కర్, మండల హెల్త్ సూపర్వైజర్ ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, డిఇఓ ఎక్సైజ్ కానిస్టేబుల్ సాయిలు,వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎంపీ




నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ మండలంలోని పోతారం ఎస్ శుభం గార్డెన్ లో శుక్రవారం ఎంపిటిసి వాసాల ఐలయ్య మనమరాలు వివాహ వేడుకకు హాజరైన కరీంనగర్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ హుస్నాబాద్ టి పి సి సి మెంబర్ కేడం లింగమూర్తి, మాజీ ఎంపిటిసి ఎండి హసన్. హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బంక చందు,హుస్నాబాద్ మున్సిపల్ కౌన్సిలర్స్ వల్లపు రాజు, పున్నసది లావణ్య, డైరెక్టర్లు బండి కుమార్. కల్లపేల్లి కావ్య వెంకటస్వామి, జిల్లా మాజీ కన్వీనర్ వెన్నరాజు, బొంగుని శ్రీనివాస్, మహేందర్ రెడ్డి. బీసీ సెల్ పోతుగంటి బాలయ్య. ఎస్టీ సెల్ బిఖ్యా నాయక్, జిల్లా జనరల్ సెక్రెటరీ బందెల హరీష్, బురుగు సతీష్పొటపల్లి గ్రామశాఖ అధ్యక్షుడు పంపర సంపత్. తదితరులు పాల్గొన్నారు.

వట్‌పల్లిలో నలుగురు బాలకార్మికుల గుర్తింపు

నవ తెలంగాణ-వట్ పల్లి

మండల కేంద్రమైన వట్‌పల్లిలో చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ సిబ్బంది, ఎస్సై మొగులయ్య ఆధ్వర్యంలో శుక్రవారం దాడులు నిర్వహించారు. చికెన్ సెంటర్, స్వీట్ హౌస్‌లో పనులు చేస్తున్న బాల కార్మికులను గుర్తించి వెంటనే వారిని అధీనంలోకి తీసుకున్నారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో విచారించారు. అనంతరం మండలం మెజిస్ట్రేట్, డిప్యూటీ తహసీల్దార్ ముందు బైండోవర్ చేశారు. పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేయించారు. బాల కార్మికుల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం పిల్లలను వారి తల్లిదండ్రులకు అప్పగించామని చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ సిబ్బంది పేర్కొన్నారు. బాల కార్మికులతో పనులు చేయించుకుంటున్న యజమానులతో చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ అధికారులు, సిబ్బంది కుమ్మక్కై పోలీసుస్టేషన్ మంతనాలు జరిపి తల్లిదండ్రులకు పిల్లలను అప్పగించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. బాలకార్మికుల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ చేసిన ఫొటోలు ఇవ్వాలని విలేకర్లు కోరితే వాటికి బయటకు వెల్లడించకూడదని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు ఉన్నాయని చెప్పడంలో అనేక సందేహాలు ఉన్నాయని పేర్కొంటున్నారు. చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ అధికారులు, సిబ్బంది దాడలు చేయడం, పోలీసుస్టేషన్‌లో కౌన్సిలింగ్ ఇవ్వడం, అనంతరం పిల్లలను వారి తల్లిదండ్రులకు అప్పగించడం తదితర అంశాలు పలు అనుమానాలకు తావిస్తున్నాయని వాపోతున్నారు. ముడుపులు అందజేయడంతోనే పిల్లలతో పనులు చేయించుకున్న యజమానులను చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ అధికారులు, సిబ్బంది వదిలి పెట్టారని ఆరోపిస్తున్నారు. బాల కార్మికులను పట్టుకున్నట్లే పట్టుకుని వదిలేసి తూతూ మంత్రంగా చైల్డ్ వెల్ఫేర్ లేబర్ డిపార్ట్మెంట్‌కు ఆన్లైన్ లో దరఖాస్తు పంపించామని చెప్పకనే చెప్పి హైడ్రామా ముగించి వెళ్లిపోయారు. కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫర్ డిపార్ట్మెంట్ ఎస్ఐ మొగులయ్య, యాదగిరి, సంతోష, నవీన్ గౌడ్, గీత పాల్గొన్నారు.



గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-నారాయణఖేడ్

మండలంలోని అబ్బెంద గ్రామంలో మాజీ ఎంపీపీ జీవులనాయక్ దాతగా నూతనంగా ఏర్పాటు చేసిన జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకట్ రెడ్డి, సర్పంచ్ సుదర్శన్ పాటిల్, ఉప సర్పంచ్ హన్మంతు, వార్డ్ సభ్యులు బస్వరాజు, భద్రప్ప, వీరయ్య, కత్తే గురప్ప, నారాయణ, గోపాల్, అనిల్‌స్వామి, జగన్నాథ్, చెన్ బసప్ప, గ్రామ పెద్దలు నందురావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డును పనులు పరిశీలించిన జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్



నవతెలంగాణ జిన్నారం

జిన్నారం మండలం ఊట్ల మంగంపేటలో నిర్మిస్తున్న రోడ్డు పనులను సంగారెడ్డి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కుంచాల ప్రభాకర్ శుక్రవారం పరిశీలించారు. ఊట్ల పత్తెమ్మ తోట నుంచి పలుగుట్ట మీదుగా మంగంపేట వరకు జడ్పీ నిధులతో వేసిన ఫార్మేషన్ రోడ్డును పరిశీలించారు. ఊట్ల మంగపేట గ్రామాల మధ్య కొన్ని సంవత్సరాలుగా ఉన్న ఇబ్బందిని దూరం చేస్తూ ఫార్మేషన్ రోడ్డును ఏర్పాటు చేయడంపై ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, సంగారెడ్డి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కుంచాల ప్రభాకర్‌లకు ఊట్ల మంగంపేట గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కుంచాల ప్రభాకర్ వెంట సర్పంచ్‌లు ఆంజనేయులు, ప్రశాంతి నరేందర్, నాయకులు నాగరాజు, విట్టు, మహేష్, రతన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో రాములుకు ప్రశంస



నవతెలంగాణ-జిన్నారం

జిన్నారం మండల ఎంపీడీవో రాములు సంగారెడ్డి జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకోవడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. పరిపాలన విభాగం, ప్రభుత్వ పథకాల అంశాలు, శాఖాపరమైన అంశాలు మొత్తంగా సమగ్రమైన పనితీరుకుగాను కలెక్టర్ చేతుల ప్రశంసాపత్రం అందుకోవడంపట్ల పలువురు ఆయనను అభినందించారు.

జగదాంబ ఎలక్ట్రానిక్ హార్డ్వేర్ షాప్ ప్రారంభం



నవతెలంగాణ-జహీరాబాద్

కార్యకర్తలు ఆర్థికంగా ఎదిగేందుకు వ్యాపారాలను ఏర్పాటు చేసుకోవడం ఎంతో శుభ పరిణామమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మహమ్మద్ తనివిర్ అన్నారు. శుక్రవారం శ్రీజగదాంబ ఎలక్ట్రికల్, హార్డ్ వేర్ శానిటరీ, పెయింటర్స్ షాప్ ప్రారంభించారు. యజమాని కిషన్ రాథోడ్‌ను అభినందించారు. బీఆర్ ఎస్ జహీరాబాద్ మండల అధ్యక్షులు రాములు యాద వ్, మాజీ కౌన్సిలర్ నామారవి కిరణ్, బాసిద్, బిజి సందీప్, హీరా తదితరులు పాల్గొన్నారు

ఉపాధ్యాయుల నిరసన



నవతెలంగాణ-కొండపాక

ఉపాధ్యాయ బదిలీలు పదోన్నతుల్లో ప్రభుత్వం విడుదల చేసిన అసంబద్ధ మార్గదర్శకాలను నిరసిస్తూ శుక్రవారం మధ్యాహ్నం కుకునూరుపల్లి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. వెంటనే ఈ మార్గదర్శకాలు మార్చాలని, స్పౌస్ పాయింట్లను రద్దుచేసి అందరికీ సమన్యాయం కల్పించాలని డిమాండ్ చేశారు .

పెళ్లికూతురుకు ఆర్థిక సాయం



నవ తెలంగాణ-మద్దూరు

మండలంలోని గాగిల్లాపూర్ గ్రామంలో పాడి రైతు మేక ఉమామహేశ్వర్ కూతురు వాహినికి సిద్దిపేట విజయ డైరీ తరపున పుస్తె మట్టెల కోసం రూ.5 వేలను శుక్రవారం అందజేశారు. సర్పంచ్ బొల్లు కృష్ణవేణి చంద్రమౌళి, సూపర్వైజర్ వడ్లకొండ భాస్కర్, సొసైటీ అధ్యక్షుడు చెవిటి మహేష్ పాడి రైతులు ఉన్నారు.

ఆవుల లారీ స్వాధీనం



నవ తెలంగాణ-సిద్దిపేట అర్బన్

సుమారు 56 ఆవులు దూడలు ఉన్న లారీని శుక్రవారం సాయంత్రం 3 టౌన్ పోలీసులు పట్టుకున్నారు. త్రీ టౌన్ పరిధిలో వెహికల్స్ చెక్ చేస్తుండగా అనుమానం వచ్చిన లారీని ఆపి చూడగా అందులో ఆవులు కనిపించినట్లు సీఐ భాను ప్రకాష్ తెలిపారు. ఈ ఆవులను కాగజ్ నగర్ నుంచి షాద్నగర్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. స్వాధీనపరచుకున్న ఆవులను మాసాయిపేట వద్ద గోశాలకు తరలించారు.

కంటివెలుగు ప్రారంభం



నవ తెలంగాణ-న్యాల్‌కల్

మండలంలోని హుసేల్లి గ్రామ పంచాయతీలో కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ సుధారాణి వెంకటరెడ్డి ప్రారంభించారు. అంధత్వం ఉన్నవారికి కంటి పరీక్షలు చేశారు. డీఎల్పీఓ రాఘవరావు, ఎంపీడీవో వెంకటరెడ్డి, ఎంపీటీసీ నీలమ్మ, పంచాయతీ సెక్రెటరీ నాగభూషణం, వైద్యులు శిరీష, నూపెన్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

మార్పు అనివార్యం





నవతెలంగాణ-పటాన్‌చెరు

'ఏ మానవ సమాజంలోనైనా మార్పులు, పరివర్తన, అభివృద్ధి అనివార్యం. ఏ సమాజమూ స్థిరంగా ఉండదు. అది ఎల్లప్పుడూ చలనశీలంగా ఉంటుంది. ప్రతి సమాజమూ దాని పూర్వ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలకు అనుగుణంగా నడుచుకుంటుంది' అని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలోని ఎస్.ఎన్.స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ నృత్య విభాగం ప్రొఫెసర్, నటి డాక్టర్ అరుణ భిక్షు అన్నారు. లలిత కళలు, వాటి ప్రాముఖ్యతను తెలియజేసే లక్ష్యంతో గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ 'ప్రదర్శనాత్మక భారతం' (పెర్ఫార్మేటివ్ ఇండియా) పేరిట శుక్రవారం నిర్వహించిన ఒకరోజు జాతీయ సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రోజువారీ జీవితంలో ప్రతి ఒక్కరం ఏదో ఒక సందర్భంలో నటించడం సహజమన్నారు. ప్రజలను ఉల్లాసపరిచేందుకు, నూతనోత్తేజాన్ని ఇచ్చేందుకు కళాకారులు కళలు ప్రదర్శిస్తారన్నారు. మల్లన్నను కీర్తిస్తూ, మరికొన్ని ప్రత్యేక సందర్భాలలోనే గొల్లలు ఒగ్గు కథ చెబుతారని, ఆ సంప్రదాయం క్రమంగా మారి ఉద్యమాలకు కూడా ఊపిరిలూదిందని డాక్టర్ అరుణ చెప్పారు. నృత్య రూపకమేదో స్పష్టంగా తెలియక పోయినా పామరులు సైతం వాటిని చూసి ఉత్తేజం పొందుతారని, అలాగే మన సంప్రదాయ నృత్యాలు వ్యాపార ప్రకటనలలో కూడా ప్రచారాస్త్రాలుగా మారాయన్నారు. కళలోనే సమ్మోహన శక్తి ఉంటుందని, రాగ-భావయుక్తంగా దానిని ప్రదర్శిస్తే జనామోదం పొందుతుందని డాక్టర్ అరుణ భిక్షు అభిప్రాయపడ్డారు. ఐఐటీ బాంబేలోని భాష సాహిత్య అధ్యయనాల విశ్రాంత ఆచార్యుడు, హిందుస్తానీ శాస్త్రీయ గాయకుడు డాక్టర్ మిలింద్ మళ్లే తన అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. 'సమకాలీన కాలంలో ప్రదర్శనల సౌందర్యం: డిజిటల్ యుగంలో వాటి తీరుతెన్నులు' అనే అంశంపై నిర్వహించనున్న చర్చాగోష్ఠిలో ఐఐటీ హైదరాబాద్ లోని డిజైన్ విభాగానికి చెందిన డాక్టర్ దీపక్ జాన్ మాథ్యూబీ కేరళకు చెందిన ప్రముఖ థియేటర్ ప్రాక్టీషనర్ ప్రొఫెసర్ చంద్ర దాసన్‌బీ సిలికాన్ ఆంధ్రా విశ్వవిద్యాలయం-ట్రిబుల్ ఐటీ హైదరాబాద్ లోని సంగీత విభాగం అధ్యాపకులు డాక్టర్ టీకేఎల్ సరోజలు పాల్గొన్నారు. యునెస్కో గుర్తింపు పొందిన సాంప్రదాయ భారతీయ కళారూపం 'కుటియాట్టం'ను సదస్సు ముగింపు సందర్భంగా ప్రదర్శించి సదస్యులందరినీ ఆకట్టుకున్నారు.తొలుత, ఆంగ్ల విభాగాధిపతి ప్రొఫెసర్ డీఆర్పీ చంద్రశేఖర్ స్వాగతోపన్యాసం చేయగా, సదస్సు నిర్వాహకురాలు డాక్టర్ మైథిలి మరాట్ అనూప్ వందన సమర్పణ చేశారు.

ఘనంగా సంప్రదాయ వస్త్రధారణ దినోత్సవం

పరంపర పేరిట ప్రతియేటా నిర్వహించే సంప్రదాయ వస్త్రధారణ దినోత్సవాన్ని (ఎత్నిక్ డే) శుక్రవారం గీతమ్ లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో భాగంగా వివిధ రాష్ట్రాలు, దేశాల సంస్కృతులు, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ! విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి పండుగ వాతావరణాన్ని తీసుకొచ్చారు. ఈ వేడుకల్లో భాగంగా నిర్వహించిన పలు ప్రదర్శనలు, చెవులూరించే ఆహార పదార్థాల స్టాళ్ళు అందరినీ ఆకట్టుకున్నాయి.

భావన నిర్మాణ కార్మికులకు సీఎం ఇచ్చిన హామీలను అమలు చేయాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు



నవతెలంగాణ-సంగారెడ్డి

భావన నిర్మాణ కార్మికులకు సీఎం ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం సంగారెడ్డి లేబర్ డిపార్ట్మెంట్ ఏఎల్ఓ యాదయ్యకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జి.సాయిలు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2022 మార్చిలో జరిగిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా వెల్ఫేర్ బోర్డు కార్డు ఉన్న కార్మికులకు లక్ష మోటార్ సైకిళ్లు ఉచితంగా ఇస్తామని ప్రకటించారని, 9 నెలలు గడిచినా నేటికీ ఏ ఒక్కరికీ అందలేదని అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా భవన నిర్మాణ కార్మికులకు వెంటనే మోటార్ సైకిళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెల్ఫేర్ బోర్డులో రాష్ట్రవ్యాప్తంగా 54 వేల పెండింగ్ క్లైమాక్స్ ఉన్నాయని, వెంటనే నిధులు విడుదల చేయాలని అన్నారు. ప్రమాద మరణాలకిస్తున్న రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలన్నారు. సహజ మరణానికి ఇస్తున్న రూ.లక్ష నుంచి రూ.5 లక్షలకు పెంచాలన్నారు. దహనసంస్కారాల ఖర్చులు, వివాహం, ప్రసూతి కానుకలకు రూ.30 వేల నుంచి రూ.లక్షకు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పెంటయ్య, దత్తు, రాములు, యాదయ్య నర్సింలు, కృష్ణ, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



నవ తెలంగాణ-పటాన్‌చెరు

జీహెచ్ఎంసీ పరిధిలోని డివిజన్ల అభివృద్ధికి ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్చెరు డివిజన్ పరిధిలోని శ్రీనగర్, శాంతినగర్ కాలనీలలో రూ.62 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణం పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. రూ.80 లక్షలతో పూర్తి చేసిన సీసీరోడ్డును ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పటాన్చెరు డివిజన్ పరిధిలో నూతన సీసీరోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఇటీవల ఐదు కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ఇందుకు అనుగుణంగా నూతన కాలనీలలో సిసి రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఏర్పాటు అవుతున్న కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళిక బద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో పటాన్చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్,బీఆర్ ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అఫ్జల్, నాయకులు, కాలనీ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో టీబీ రోగులకు ఆపన్న హస్తం



నవతెలంగాణ-జోగిపేట

జోగిపేట లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గత కొంత కాలంగా టీబీ రోగులకు న్యూట్రిషన్ కిట్‌ను అందజేస్తున్నట్లు క్లబ్ జోన్ చైర్మన్ ఆకుల రాంబాబు తెలిపారు. ప్రతి నెల మాదిరిగానే నెల రోజులకు సరిపోను న్యూట్రిషన్ ఫుడ్‌ను ఆయన స్వంత ఖర్చులతో ముస్లాపూర్ గ్రామానికి చెందిన స్వరూప కుటుంబ సభ్యులకు శుక్రవారం స్థానిక డి.ఎస్.రెడ్డి ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైన్స్ క్లబ్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ చైర్మెన్ డాక్టర్ అనంతరెడ్డి, క్లబ్ అధ్యక్షుడు రామకష్ణ, క్లబ్ ట్రెజరర్ చంద్రశేఖర్, సభ్యులు జి.సంతోష్‌కుమార్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఎగ్జామ్ వారియర్స్ 2023 పీఎం మోడీతో పరీక్షపై చర్చ

నవతెలంగాణ-సంగారెడ్డి

ఎగ్జామ్ వారియర్స్ 2023 ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో పరీక్ష పై చర్చ కార్యక్రమాన్ని ప్రకృతి ఎన్విరాన్మెంట్ సొసైటీ సంగారెడ్డి నిర్వహణ కమిటీ పవన్ ముదిరాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం సంగారెడ్డిలోని కరుణ హైస్కూల్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సంగారెడ్డి ఎంఈఓ వెంకట్ నర్సింలు గౌడ్, ప్రకృతి ఎన్విరాన్మెంట్ సొసైటీ రాష్ట్ర సభ్యులు రాజేశ్వరరావు దేశ్పాండే హాజరై మాట్లాడుతూ నరేంద్ర మోడీ ఇచ్చిన సూచనలను విద్యార్థులు క్లుప్తంగా వివరించారు. ఎగ్జామ్ టైంలో టెన్షన్ పడకుండా పరీక్షలను ఎంజాయ్ చేస్తూ రాయాలన్నారు. విద్యార్థులు సమయసారిని వారి తల్లిని చూసి నేర్చుకోవాలన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను క్రమ పద్ధతిగా స్మార్ట్ గా నేర్చుకోవాలని సూచించారు. విద్యార్థులతో కలిసి ప్రత్యక్ష ప్రసారం వీక్షించారు. విద్యార్థులకు ఆర్ట్ అండ్ పెయింటింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. మొదటి రెండు మూడు స్థానాలు వచ్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులందరికీ సర్టిఫికెట్స్ ఇచ్చారు. ప్రకృతి ఎన్విరాన్మెంట్ రాష్ట్ర సభ్యులు పోచారం రాములు, పట్టణ ప్రజా ప్రతినిధులు పందుల నాగరాజు, కసిని వాసు బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు సందీప్ గౌడ్ కార్యలయ కార్యదర్శి ఆదిత్య బీజేవైఎం పట్టణ అధ్యక్షులు వినోద్ బీజేవైఎం నాయకులు అరవింద్ రాకేష్ గౌడ్, శివ యాదవ్, గిరి పాల్గొన్నారు.

ఆలస్యంగా మంజూరవుతున్న కల్యాణలక్ష్మి సాయం



నవతెలంగాణ-కోహెడ

మండల కేంద్రానికి చెందిన కట్ట సారవ్వ కూతురు కట్ట రజితకు వివాహం జరిగి 25 నెలలు గడిచిన కళ్యాణలక్ష్మి సాయం మంజూరి కాలేదని బిజెపి మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రచార ఆర్భాటాలకే పరిమితమైందే తప్పా ఆచరణలో కళ్యాణలక్ష్మి పథకం లబ్దిదారులకు చేరడంలో కాలయాపన చేస్తూ నత్తనడకన పనిచేస్తుందన్నారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న కళ్యాణలక్ష్మి చెక్కులను త్వరితగతిన మంజూరి చెసేందుకు ఎమ్మెల్యే సహకరించాలని కోరారు. కట్ట రజిత వివాహం 2020 లో జరిగిందని ధరఖాస్తు చేసుకొని 25 నెలలు గడిచి పోయాయని, ఇప్పటికైన వెంటనే కళ్యాణలక్ష్మి చెక్కులను మంజూరి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు గుగ్గిళ్ల శ్రీనివాస్ ఉన్నారు.

శ్రీవర్షిణికి అభినందలు



నవ తెలంగాణ - సిద్ధిపేట

ఢిల్లీలో ఈ నెల 23న పార్లమెంట్‌లో జరిగిన 'నేతాజీ లైఫ్ అండ్ లెగసీ అమెరికాలో' స్పీచ్ కాంపిటేషన్‌లో పాల్గొన్న సిద్ధిపేట పట్టణానికి చెందిన బండవరపు శ్రీవర్షిణిని శుక్రవారం ఫార్మర్స్ ఫస్ట్ ఫౌండేషన్ చైర్మన్ చక్రధర్ గౌడ్ తన కార్యాలయంలో శాలువాతో సన్మానించి రూ.11,111ల చెక్కును అందజేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ యువత అన్నీ రంగాలలో ముందుండాలని సూచించారు. ప్రతిఒక్కరూ శ్రీ వర్షిణిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తో జరిగిన ప్రోగ్రాంలో మన సిద్ధిపేట గూర్చి చర్చించారా అని ఆరా తీసారు. కార్యక్రమంలో అరుషికా పాల్గొన్నారు.

పందిళ్లలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ మండలంలోని పందిళ్ల గ్రామంలో శుక్రవారం ఈజీఎస్ పథకంలో ఎస్సీ, బీసీ కాలనీలో పది లక్షల రూపాయలతో చేపట్టే సీసీరోడ్డు పనులను పందిళ్ల గ్రామ సర్పంచ్ తోడేటి రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రమేష్ మాట్లాడుతూ గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, వార్డు సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

శుభకార్యాలకు హాజరైన ఎమ్మెల్యే మాణిక్యరావు



నవ తెలంగాణ-జహీరాబాద్

నియోజకవర్గంలో జరిగిన వివిధ శుభకార్యాలలో శాసనసభ్యులు కోనింటి మాణిక్‌రావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మహమ్మద్ తనివిర్ పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మెన్ పెంట రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ జహీరాబాద్ పట్టణ అధ్యక్షులు సయ్యద్ మోహియోద్దీన్, ఎంపీటీసీ రజినీ ప్రియ సంతోష్ పాటిల్, హన్నాన్ జావేద్, సర్పంచ్ ఫోరమ్ అధ్యక్షులు జగదీశ్వర్, సర్పంచ్ లు కృష్ణ, కృష్ణ ముదిరాజ్, మాజీ సర్పంచ్ మొహమ్మద్ కలిమ్, మాజీ ఎంపీపీ విజయ కుమార్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు బొగ్గుల సంగమేశ్వర్, నర్సింలు పటేల్, నాయకులు సాయి ప్రణీత్ రెడ్డీ, నర్సింలు, సత్యం ముదిరాజ్, బిజీ సందీప్, శ్రీనివాస్, నర్సింలు, సంగన్న వహీద్, జహీద్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ లు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లి దేవాలయ నిర్మాణానికి భూమిపూజ



నవతెలంగాణ-గుమ్మడిదల

గుమ్మడిదల మండలం వీరారెడ్డి పల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పెద్దమ్మ తల్లి దేవాలయ నిర్మాణానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ గ్రామస్తుల ఆహ్వానం మేరకు శుక్రవారం గ్రామాన్ని సందర్శించి భూమిపూజ నిర్వహించారు కార్యక్రమంలో ఉప సర్పంచ్ టి, సత్తయ్య, వార్డ్ సభలు సి కనకరాజు, కె యాదగిరి, ఎస్ఎంసి చైర్మన్ బి గణేష్, ఎస్ నర్సింలు, ఎస్ గోపాల్, బి వెంకటేష్, టి సత్తయ్య, బి చంద్రయ్య, ఎస్ మల్లేష్, ఎస్ కృష్ణ, కె వీరేష్, ఎస్ రాములు, బి నర్సింలు, బి అశోక్, టి శేఖర్, ఎస్ సంతోష్, కె మల్లేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కురుమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-నారాయణఖేడ్

నియోజకవర్గ కురుమ సంఘం కార్యాలయంలో 2023 సంవత్సర కురుమ సంఘం క్యాలెండర్‌ను శుక్రవారం ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కురుమల అభ్యున్నతికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. కురుమ సంఘం నారాయణఖేడ్ పట్టణ అధ్యక్షుడిగా సాయి కురుమను ఆ సంఘం జిల్లా అధ్యక్షులు బోరుగడ్డ పుష్ప నగేష్ కురుమ ప్రకటించారు. కార్యక్రమంలో నారాయణఖేడ్ నియోజకవర్గం కురుమ సంఘం అధ్యక్షుడు ప్రభాకర్ కురుమ, ఉపాధ్యక్షుడు మల్‌గొండ, గౌరవ అధ్యక్షులు అంజయ్య, కార్యదర్శి పండరి, ప్రధాన కార్యదర్శి నవ, యువత అధ్యక్షులు నర్సింలు, దశరథ్, సాయి, సంతోష్, దత్తు, మల్లప్ప, నగేష్, జైపాల్, నరసన్న, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సమాచారం ఇవ్వకుండా భూ సర్వే చేయడం అన్యాయం



నవతెలంగాణ-మునిపల్లి

సంగమేశ్వర బసవేశ్వర ఎత్తిపోతల పథకం అమలులో భాగంగా రైతులకు ఎలాంటి సమాచారం లేకుండా అధికారులు పోలీసు పహారాలో దౌర్జన్యంగా భూ సర్వే చేయడం అన్యాయమని, దీన్ని ఖండిస్తున్నామని తీన్మార్ మల్లన్న టీం రాష్ట్ర సభ్యుడు రమేష్ యాదవ్ అన్నారు. మునిపల్లి మండలం తక్కడపల్లి, చిన్నచెల్మడ గ్రామాల రైతులకు, భూ యజమానులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అధికారులు ఇష్టానుసారంగా సర్వే చేసుకుని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నారని ఆరోపించారు. సర్వేయర్లు, రెవెన్యూ అధికారులు, పోలీసులు దౌర్జన్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. సింగూర్ ప్రాజెక్ట్ వరద ముంపులో వందల ఎకరాలు ఇదివరకే కోల్పోయారని, ఆ నష్ట పరిహారం ఇప్పటివరకు అందలేదని ఆరోపించారు. రైతులు వారి భూములను ఇవ్వడానికి సిద్ధంగా లేరన్నారు. ఈ రెండు గ్రామస్తులు రైతులు చిన్నసన్నకారు రైతులే ఉన్నారు. వాళ్ల భూములు బలవంతంగా లాగేసుకుంటే వారి జీవనం భారంగా మారుతుందన్నారు. రైతులకు నష్టపరిహారం ముందుగా చెల్లించి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

ఒత్తిడిని జయించి విజయాన్ని సొంతం చేసుకోండి



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడిని జయించి విజయాన్ని సొంతం చేసుకోవాలని బీజేపీ హుస్నాబాద్ నియోజకవర్గ నాయకులు బొమ్మ శ్రీరాం చక్రవర్తి అన్నారు. శుక్రవారం హుస్నాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో ప్రధానమంత్రి దేశ వ్యాప్తంగా పరీక్షా పే చర్చ కార్యక్రమం చేపట్టిన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోడీ చేసిన సందేశాలను,సూచనలను డిజిటల్ స్క్రీన్ పై విద్యార్థులకు వివరించారు. ఈకార్యక్రమంలో హుస్నాబాద్ అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ జనగామ వేణు గోపాల్ రావు, బీజేపీ హుస్నాబాద్ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కందుకూరి సతీష్, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి తోట స్వరూప, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు బొనగిరి రవి, పట్టణ ప్రధాన కార్యదర్శి తోట సమ్మయ్య, ఉపాధ్యక్షులు పోలోజు రవీందర్, ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడు పోలోజు రాజేందర్, కిసాన్ మోర్చా పట్టణ అధ్యక్షుడు వేల్పుల నాగార్జున్, ఓబీసీ మోర్చా పట్టణ ప్రధాన కార్యదర్శి గాదాసు రాంప్రసాద్, బీజేవైయం పట్టణ అధికార ప్రతినిధి అశాడపు శ్రీనివాస్, బీజేపీ నాయకులు కోమటి సత్యనారాయణ, కాదాసు నర్సయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయం కమిటీ చైర్మన్‌గా పడమటి లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-గుమ్మడిదల

గుమ్మడిదల మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ కమిటీ చైర్మన్‌గా పడమటి లక్ష్మారెడ్డిని శుక్రవారం ఎన్నుకున్నామని గ్రామస్తులు తెలిపారు. గతంలో రైతు సంఘాల అధ్యక్షులుగా పనిచేసిన అనుభవం అతనికి ఉందన్నారు. వెంకటేశ్వర స్వామి దేవాలయ కమిటీ చైర్మన్‌గా ఎన్నుకున్నందుకు లక్ష్మారెడ్డి ధన్యవాదాలు తెలిపారు. రెండోసారి రైతు సంఘం అధ్యక్షుడిగా పొచ్చుగారి మోహన్‌రెడ్డిగా గ్రామ రైతుల ఆమోదం మేరకు నియమించినట్లు తెలిపారు.

అభివృద్ధి పనుల నిర్మాణానికి శంకుస్థాపన



నవతెలంగాణ జోగిపేట

రూ.20 లక్షలతో సాయిబాన్ పేట గ్రామంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసినట్లు అందోల్ ఎంపీపీ జోగు బాలయ్య తెలిపారు. శుక్రవారం సాయిబాన్ పేట్ గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మిస్తున్న ముదిరాజ్ భవనానికి భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే ఎస్డిఎఫ్ ఫండ్ నుంచి నిధులను మంజూరు చేశారని ఆయన తెలిపారు. ముదిరాజులు నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేయాలని అని తెలిపారు. రూ.5 లక్షలు ఎస్సి కాలనీలో, రూ. 5 లక్షలు బీసీ కాలనీ సీసీ రోడ్డు పనులకు కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ఏ ఈ మొగులయ్య, సర్పంచ్ నర్సమ్మ, పంచాయతీ కార్యదర్శి అశోక్, బి ఆర్ స్ సీనియర్ నాయకులు శంకరప్ప, ప్రభాకర్, గ్రామ ప్రెసిడెంట్ పాండు ముదిరాజ్, నాయకులు బద్రి, పోచయ్య, గడ్డం రామకృష్ణ, పుట్టి కిష్టయ్య, పుట్టి ప్రభాకర్, శ్రీను, అశోక్, కిషన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



నవతెలంగాణ-మనూరు

గణతంత్ర దినోత్సవం సందర్భంగా బెల్లపూర్‌లోని శ్రీశివసాయి పాఠశాలలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రతి సంవత్సరం పాఠశాలలో విద్యార్థులు ఆట పాటలతో పాటు పలు విన్యాసాలు చేస్తున్నారు. చదువుతో పాటు ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని పాఠశాల వ్యవస్థాపకులు చిలాపల్లి సంజీరెడ్డి తెలిపారు. వెనుకబడిన విద్యార్థులపై విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. వివిధ రంగాల్లో విద్యార్థులు ప్రదర్శించిన నైపుణ్యాలను గుర్తించి బహుమతులు అందజేస్తున్నామని తెలిపారు. గురువారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆటపాటల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశామన్నారు. హెచ్ఎం సంజీవరెడ్డిని ఉపాధ్యాయ బృందం శాలువాతో ఘనంగా సన్మానించారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

నవతెలంగాణ-పటాన్ చెరు

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మండలంలోని చిట్కుల్ గ్రామానికి చెందిన విఠల్(42) తన బైక్‌పై బచ్చుగూడ నుంచి చిట్కుల్ వస్తున్నాడు. గ్రామ శివారులో గల భూ లక్ష్మమ్మ గుడి వద్దకు రాగానే రాంగ్ రూటులో వచ్చిన ట్రాక్టర్ బైకును ఢీకొట్టింది. దీంతో బైక్ పైనుంచి కింద పడ్డ విఠల్ తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య నీరజ ఫిర్యాదు మేరకు ఎస్సై ప్రసాదరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ఘనంగా సీనియర్ జర్నలిస్టు సిద్దన్న పాటిల్ కూతురు వివాహం



నవతెలంగాణ జహీరాబాద్

జహీరాబాద్ నియోజకవర్గ సీనియర్ జర్నలిస్టు సిద్దన్న పాటిల్ కూతురు వివాహం జహీరాబాద్ పట్టణంలోని ఎస్వీ కన్వెన్షన్ కల్యాణ మండపంలో ఘనంగా జరిగింది. ఈ వివాహానికి ఎమ్మెల్యే మాణిక్యరావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మహమ్మద్ తనివిర్, టీపీసీసీ నాయకులు వై నరోత్తం, మాజీ మంత్రి డాక్టర్ జె.గీతారెడ్డి, వివిధ జర్నలిస్టు సంఘాల నాయకులు మహమ్మద్ ఫైసల్, సయ్యద్ మహబూబ్ అలీ, మినాజ్, మహమ్మద్ కరీం, వై శ్రీనివాస్ రెడ్డి , జె శ్రీనివాస్ శాస్త్రి, అశోక్, నర్సింలు, మల్లన్న, మజ్జిగ కిరణ్, వీరభద్రి, ,రాయికోడ్ మాజీ జడ్పిటిసి అంజయ్య, సీనియర్ కాంగ్రెస్ నాయకుల సయ్యద్ మసూద్ హుస్సేన్,జగన్మోహన్ రెడ్డి,మాజీ సర్పంచ్ శంకర్, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు పి.నాగిశెట్టి, కో అప్షన్ సభ్యులు మైనోద్దీన్,చంద్రా రెడ్డి,చెంగల్ జైపాల్,అశోక్, తదితరులు హాజరై వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.

పాడి కౌశిక్‌రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలి



నవతెలంగాణ-ఐడీఏ బొల్లారం


తెలంగాణ గవర్నర్ తమిళిసైపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని బీజేపీ సీనియర్ నాయకులు టీ.రవీందర్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రథమ పౌరులాలు గవర్నర్ తమిళిసైపై ఎమ్మెల్సీ పదవిలో ఉంటూ అనుచిత వ్యాఖ్యలు చేయడం చాలా దురదృష్టకరమన్నారు. శాసన మండల సభ్యుడిగా ఉంటూ ఒక వీధి రౌడీ లాగా మాట్లాడడం సరికాదనాప్త్రురు. అనుచిత వ్యాఖ్యలు గాను పాడి కౌశిక్ రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని బొల్లారం మున్సిపల్ బీజేపీ కమిటీ తరపున బొల్లారం పోలీస్ స్టేషన్లో శుక్రవారం స్థానిక నాయకులు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నేత కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి,కౌన్సెలర్ వి. శ్రీకాంత్ యాదవ్, పార్టీ సీనియర్ నాయకులు, రాఘవేంద్ర రెడ్డి, ఉదయ్ కుమార్, రాజు, ప్రధాన కార్యదర్శులు రోహిత్ సింగ్, అరుణ్ పాల్గొన్నారు.

నర్సరీల సందర్శన



నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని బెజ్జంకి క్రాసింగ్, తోటపల్లి గ్రామాల్లోని నర్సరీలను డీఆర్డీఓ గోపాల్ రావు, ఏపీడీ ఓబులేసు శుక్రవారం సందర్శించి మొక్కలను పరిశీలించారు. నర్సరీల్లోని మొక్కలపై జాగ్రత్తలు తీసుకోవాలని డీఆర్డీఓ సూచించారు. సర్పంచులు టేకు తిరుపతి, నర్సింగరావు,ఎంపీఓ విష్ణు వర్ధన్, పంచాయతి కార్యదర్శులు పాల్గొన్నారు.



వధూవరులను ఆశీర్వదించిన దామోదర్ రాజనర్సింహ

నవతెలంగాణ-రేగోడు



వెంకటాపురం గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు బెజ్జి శేఖర్ సోదరి స్వాతిక-నర్సింలు వివాహానికి శుక్రవారం మాజీ ముఖ్యమంత్రి దామోదర్ రాజనర్సింహ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు మున్నూరు కిషన్, జెడ్పీటీసీ యాదగిరి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దిగంబరావ్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు చిదిరే కృష్ణ, రాజు పటేల్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి

రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం ఉపాధ్యక్షులు నత్తి మల్లేష్ ముదిరాజ్

నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఏర్పాటు చేస్తున్న నర్సరీపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం ఉపాధ్యక్షులు, గ్రామ సర్పంచ్ నత్తి మల్లేష్ ముదిరాజ్ పేర్కొన్నారు. మనోహరాబాద్ మండలం మేజర్ గ్రామపంచాయితీ కాళ్ళకల్‌లో ఏర్పాటు చేసిన నర్సరీని ఏపీవో ఆదినారాయణతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మల్లేశ్ మాట్లాడుతూ నర్సరీలో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మొత్తం పదివేల మొక్కల పెంపకం చేపట్టినట్టు తెలిపారు. నర్సరీలో ఏర్పాటు చేసిన మొక్కలతో గ్రామంలోని ప్రతి వీధిలో పెద్ద ఎత్తున మొక్కలను నాటనున్నామని తెలిపారు. హరిత హారంలో గ్రామాన్ని పూర్తి ఆదర్శవంతంగా ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.

కాంగ్రెస్ మండల మహిళ అధ్యక్షురాలి నియామకం

నవతెలంగాణ-నిజాంపేట



మండల పరిధిలోని కె వెంకటాపూర్ గ్రామానికి చెందిన ఎంపీటీసీ భాగ్యలక్ష్మి సిద్ధ రాములను కాంగ్రెస్ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలిగా నియమిస్తూ శుక్రవారం జిల్లా మహిళా అధ్యక్షురాలు రాజేశ్వరి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి సిద్ద రాములు మాట్లాడుతూ మండల మహిళా అధ్యక్షురాలుగా నియమించినందుకు జిల్లా మహిళా అధ్యక్షురాలు రాజేశ్వర్‌కి, జిల్లా అధ్యక్షులు కాంటారెడ్డి తిరుపతిరెడ్డికి, టీపీసీసీ అధికార ప్రతినిధి మ్యాడం బాలకృష్ణకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మండలంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి ఎల్లవేళలా కృషి చేస్తానన్నారు. గ్రామాలలోని మహిళలను ఏకతాటిపైకి తీసుకువచ్చి పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు రాజేశ్వరి, జిల్లా అధ్యక్షులు కాంటారెడ్డి తిరుపతిరెడ్డి, మ్యాడం బాలకృష్ణ , సుప్రభాతారావు రమేష్ రెడ్డి, మామిండ్ల ఆంజనేయులు, మండల అధ్యక్షుడు బక్కన్న గారి లింగం గౌడ్, జిల్లా కార్యదర్శి పంజా మహేందర్, చింతల స్వామి, ఉపాధ్యక్షులు మారుతి, పట్టణ అధ్యక్షులు నసీరుద్దీన్ యూత్ అధ్యక్షులు వినోద్, చిన్న నారా గౌడ్, పాల్గొన్నారు

మున్సిపాలిటీ వద్ద ఎమ్మార్పీఎస్ నాయకుల వింత నిరసన

నవతెలంగాణ-మెదక్ టౌన్



పాలకవర్గం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా పాలన కాలుష్యమయమైందని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు శుక్రవారం నిరసన చేపట్టారు. అధికారుల వైఖరిని నిరసిస్తూ కొబ్బరికాయలు కొడుతూ నిరసన వ్యక్తం చేశారు. మున్సిపల్ కాంప్లెక్స్ దుకాణాల రీ టెండర్ ఓపెన్ యాక్షన్‌కు పాలకవర్గం తీర్మానం చేసి ఖాళీ చేయాలని, ఫైనల్ నోటీసులు ఇచ్చి రెండేళ్ళ గడిచిపోయినప్పటికీ ఖాళీ చేయకపోవడంపై నిరసన వ్యక్తం చేశారు. బీసీ, ఎస్సీ నిరుద్యోగుల వ్యాపార నిమిత్తం దుకాణాలను కేటాయించేందుకు నోటిఫికేషన్ విడుదలకు తగిన చర్యలు తీసుకోకపోవడం పట్ల మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బాలరాజ్, ప్రవీణ్, ప్రభాకర్, సైదులు, రమేష్, కృష్ణ, అనిల్, సుందర్, కుమార్ తదితరులు ఉన్నారు.

వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా రథోత్సవం

నవతెలంగాణ-వెల్దుర్తి



మండల పరిధిలోని బస్వాపూర్ గ్రామ పరిసరాల్లో స్వయంభుగా వెలసిన శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం రథోత్సవం నిర్వహించారు. విగ్రహాలను ఊరేగింపుగా పురవీధుల గుండా తిప్పుతూ వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్, నిర్వాహకులు సింహం, పూజారి బసప్ప, సుదర్శన్ , నంబూద్రి, తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ కార్పొరేషన్ యూనిట్ల సంఖ్య పెంచాలి

నవతెలంగాణ-పాపన్నపేట



మైనార్టీ కార్పొరేషన్ కింద ఉపాధి కోసం ఏర్పాటు చేసుకునే యూనిట్ల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేస్తూ వివిధ గ్రామాల మైనార్టీలు పాపన్నపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం రాస్తారోకో చేపట్టారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలోని అన్ని గ్రామాలలో కలిపి 119 దరఖాస్తులు రాగా, కేవలం మూడే యూనిట్లు ఉన్నాయని వారి పేర్కొన్నారు. 119 దరఖాస్తులు వస్తే కేవలం 3 యూనిట్లు ఏ మూలకు సరిపోతాయని వారు పేర్కొన్నారు. ఈ మేరకు యూనిట్ల సంఖ్యను పెంచాలని వారు డిమాండ్ చేశారు. పోలీసులు జోక్యం చేసుకొని రాస్తారోకోను విరమింప చేశారు.

మహిళ ఉద్యోగస్తులకు అవగాహన సదస్సు

నవతెలంగాణ-చిన్న శంకరంపేట



మండలంలోని ఎమ్మెస్ఎన్ ప్రైవేట్ కంపెనీలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మెదక్ ఎస్పీ ఆదేశాల మేరకు చిన్న శంకరంపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎంఎస్ఎన్ లైఫ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఉమెన్స్ సేఫ్టీ గురించి అవగాహన కల్పించారు ఇందులో భాగంగా షీ టీం ఏఎస్ఐ లక్ష్మి, కానిస్టేబుల్ కిరణ్ కుమార్, భరోసా సెంటర్ పిసి అనూష, ఉమెన్ లీగల్ అడ్వైజర్, ఉమెన్ వెల్ఫేర్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, సఖి సెంటర్, కంపెనీలో పని చేస్తున్న సుమారు 70 మంది మహిళ ఉద్యోగస్తులకు పని సమయంలో జరుగుతున్న వేధింపులపై అవగాహన కల్పించారు.ఇతర నేరాలు సైబర్ క్రైమ్స్ టాలెంటెడ్ ప్రాముఖ్యత ఉమెన్ సేఫ్టీ ఆంటీ హ్యూమన్ ట్రాఫిక్ గురించి అవగాహన కల్పించారు. ఎస్సై సుభాష్ గౌడ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం నుంచి కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలి

హెూలియో దాసరి సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు శాఖమూరి యాదగిరి

నవతెలంగాణ-నర్సాపూర్



హెూలియో దాసరి కులస్తులకు కుల ధ్రువీకరణ పత్రాలు ఆర్డీవో కార్యాలయం నుంచి కాకుండా, తహసీల్దార్ కార్యాలయం నుంచి జారీ చేయాలని కోరుతూ శుక్రవారం హెూలియో దాసరి సంఘం ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయ సూపరింటెండెంట్ గ్రేసీ బాయికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా హెూలియో దాసరి సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు శాఖమూరి యాదగిరి మాట్లాడుతూ హెూలియో దాసరి కులస్తులకు కుల ధ్రువీకరణ పత్రాలు ఆర్డీవో కార్యాలయం నుంచి జారీ చేయడం వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి హెూలియో దాసరులకు తహసీల్దార్ కార్యాలయం నుంచి కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వడియారం క్రీడాకారుడు



నవతెలంగాణ-చేగుంట

వాలీబాల్ పోటీలలో జాతీయస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారుడిని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ సన్మానించారు. చేగుంట మండల పరిధిలోని వడియారం గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ గిరి గౌడ్ కుమారుడు రాహుల్ గౌడ్ జాతీయస్థాయిలో వాలీబాల్ పోటీలలో విశేష ప్రతిభ కనబరిచాడు. రాహుల్ గౌడ్‌ను మెదక్ కలెక్టరు కార్యాలయంలో మెదక్ అదనపు కలెక్టర్ ప్రతిమ, ఎస్పీ రోహిణి ప్రియదర్శిని సన్మానించి పురస్కార పత్రాన్ని అందజేశారు. తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

నష్టపరిహారం చెక్కును తీసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి

ఆర్డీవోకు వినతి పత్రం అందజేసిన బాధిత రైతులు

నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

తాము కొనుగోలు చేసిన భూమికి వచ్చిన నష్ట పరిహారం చెక్కును తమకు తెలియకుండా అమ్మిన రైతు తీసుకోవడంతో తమకు న్యాయం చేయాలంటూ రంగాయిపల్లి గ్రామానికి చెందిన రైతులు తూప్రాన్ ఆర్డీవోకు వినతి పత్రం అందజేశారు. శుక్రవారం వారు ఆర్డీవో కార్యాలయం వద్ద విలేఖరులతో మాట్లాడుతూ మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన రామానుజమ్మకు సర్వే నంబర్ 132లో ఐదెకరాల ప్రభుత్వ భూమి అసైన్ చేశారు. కాగా కొన్ని సంవత్సరాల క్రితం రంగాయిపల్లి గ్రామానికి చెందిన శంకరయ్య తదితరులు కొనుగోలు చేశారు. కాగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటు కోసం భూములను సేకరించగా వీరికి చెందిన భూమిని ప్రభుత్వం తీసుకుంది. దాంతో నష్ట పరిహారం చెక్కు రావడంతో కొనుగోలు చేసిన రైతులు కబ్జాలో ఉండగా వారికి తెలియకుండా నష్ట పరిహారం చెక్కును అమ్మకం చేసిన రైతుకు ఆర్డీవో కార్యాయంలో ఇచ్చారు. విషయం తెలుసుకున్న రంగాయిపల్లి రైతులు కొండాపూర్ నాయకులు చింతల రవిముదిరాజ్, ఉపసర్పంచ్ నూకల వెంకటేష్‌యాదవ్, వార్డు సభ్యులు చింతల బాబుముదిరాజ్‌లతో కలిసి ఆర్డీవో కార్యాలయానికి చేరుకున్నారు. తమకు రావాల్సిన నష్ట పరిహారం చెక్కును తమకు తెలియకుండా అమ్మిన వారికి ఇచ్చారని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నష్ట పరిహారం చెక్కును తమకు ఇప్పించి న్యాయం చేయాలంటూ ఆర్డీవో శ్యాంప్రకాష్‌ను కోరారు. దాంతో వెంటనే విచారణ చేపట్టి రైతులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.



కొండాపూర్, రంగాయిపల్లి గ్రామలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

ప్రజల మన్ననలు పొందేలా పనిచేయాలి

నార్సింగి పోలీస్ స్టేషన్ తనిఖీ జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని

నవతెలంగాణ-మెదక్ రూరల్

పోలీసులు ప్రజల మన్ననలు పొందేలా పని చేయాలని జిల్లా ఎస్పీ రోహిణి పిప్రియదర్శిని సూచించారు. నార్సింగి పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఎస్పీ రోహిణి ప్రియదర్శిని ఆకస్మికంగా తనిఖీ చేసి పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందేలా పనిచేస్తూ పోలీస్ శాఖకు, జిల్లాకు మంచి పేరు తేవాలన్నారు. బాధితులు పోలీస్ స్టేషన్‌కు వస్తే న్యాయం జరుగుతుందని విశ్వసించి చిరునవ్వుతో తమ ఇంటికి వెళ్లాలన్నారు. అప్పుడే పోలీస్ వ్యవస్థపై గౌరవం మరింత పెరుగుతుందన్నారు. ప్రతిరోజు పోలీస్ స్టేషను పరిశుభ్రంగా ఉంచాలని, పోలీస్ స్టేషన్‌లోని వర్టికల్స్ నిర్వహణ, ఆన్లైన్లో కేసుల వివరాలు నమోదు చేసే విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి పిటిషన్‌ను ఆన్లైన్లో నమోదు చేయాలని, సాంకేతికంగా ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బ్లూ కోట్స్, పెట్రో కార్స్ నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. డయల్100కు కాల్స్ వచ్చిన వెంటనే తక్షణమే స్పందించి సంఘటన స్థలానికి చేరుకొని బాధితులకు న్యాయం చేయాలని సూచించారు.



పాత నేరస్తులపై నిఘా ఏర్పాటు చేయాలన్నారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి వాహనదారుడు అతివేగంగా వాహనాలను నడపవద్దని ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ సురక్షితంగా తమ గమ్యాన్ని చేరాలన్నారు. ఈ కార్యక్రమంలో రామాయంపేట సీఐ చంద్ర శేఖర్ రెడ్డి, నార్సింగి ఎస్.ఐ. నర్సింలు , సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా నార్సింగి నూతన పోలీస్ స్టేషన్ కోసం స్థలాన్ని ఎస్పి రోహిణి ప్రియదర్శిని పరిశీలించారు.

పేదింటి ఆడబిడ్డల పెద్దన్న బండారి గంగాధర్

నవతెలంగాణ-నర్సాపూర్



శివంపేట మండల పరిధిలోని పిల్లుట్ల గ్రామానికి చెందిన ప్రముఖ సంఘ సేవకులు సేవా రత్న అవార్డు గ్రహీత బండారి సంతోషా గంగాధర్ పేదింటి ఆడపడుచుల పెళ్లిళ్లకు పుస్తె మట్టెలు అందిస్తూ పెద్దన్నగా నిలుస్తున్నారు, శుక్రవారం ఒకే రోజు నర్సాపూర్ నియోజకవర్గంలోని నలుగురు ఆడపడుచుల పెళ్లిళ్లకు పుస్తె మట్టెలు అందజేసి ఆదర్శంగా నిలిచాడు. నర్సాపూర్ పట్టణంలోని అనిత నాగభూషణం దంపతుల కూతురు శిరీష వివాహానికి, కొల్చారం మండలం వసుర తండాకు చెందిన బాణావత్ కల్పన బాల్ సింగ్ దంపతుల కూతురు పూజ వివాహానికి, మండల కేంద్రమైన వెల్దుర్తి పట్టణానికి చెందిన ఆంజనేయులు గౌడ్ అమృత దంపతుల కూతురు జ్యోతి వివాహానికి, నర్సాపూర్ మండల పరిధిలోని తిరుమలాపూర్ గ్రామానికి చెందిన బొమ్మల లక్ష్మి చంద్రయ్య దంపతుల కూతురు శివనీల వివాహానికి పుస్తె మట్టెలు అందజేశారు. ఈ సందర్భంగా ఆడబిడ్డల కుటుంబీకులు, బంధువులు బండారి గంగాధర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

హాత్ సే హాత్ జోడో యాత్రతో ఇంటింటి ప్రచారం



నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని బచ్చు రాజు పల్లి, తిప్పనగుల్ల, కే.వెంకటాపూర్ గ్రామాలలో శుక్రవారం బ్లాక్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో హాత్ సే హాత్ జూడో యాత్ర ప్రారంభించారు. ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాంటారెడ్డి తిరుపతిరెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి మ్యాడం బాలకృష్ణ, పీసీసీ జనరల్ సెక్రటరీ సుప్రభాత రావులు పాల్గొన్నారు. గ్రామాలలో తిరుగుతూ ఇంటింటి ప్రచారం మొదలుపెట్టారు. దాదాపు 500 మంది వరకు ఈ యాత్రలో పాల్గొన్నారు. గ్రామాలలో టీఆర్ఎస్ పార్టీ నాయకులను కలుస్తూ ఆలింగనం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని అన్నారు. తెలంగాణ మొట్టమొదటి ముఖ్యమంత్రి దళితున్ని చేస్తానని మోసం చేశారని గుర్తు చేశారు. దళితులకు మూడెకరాల భూమి, ఇల్లు లేని పేదవారికి డబల్ బెడ్ రూమ్ ఇల్లు కట్టించలేదని, లక్ష రూపాయల రుణమాఫీ చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు లక్షల రుణమాఫీ చేస్తామని, ఇందిరమ్మ ఇల్లు కట్టిస్తామని, ధరణి పోర్టల్ రద్దు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు రాజేశ్వరి, రామాయంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్ రెడ్డి, కిసాన్ జిల్లా అధ్యక్షులు పబ్బతి ప్రభాకర్ రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్, మండల అధ్యక్షుడు బక్కన్న గారి లింగం గౌడ్, జిల్లా కార్యదర్శి పంజా మహేందర్, ఉపాధ్యక్షులు ధాత్రిక మారుతి, మండల ఉపాధ్యక్షులు అందేస్వామి, పట్టణ అధ్యక్షుడు నసీరుద్దీన్, కల్వకుంట మాజీ ఎంపీటీసీ చింతల స్వామి, రజాక్ పల్లి మాజీ సర్పంచ్ చిన్న నారా గౌడ్, మసూద్, మండల యూత్ అధ్యక్షుడు రమావత్ వినోద్, మండల కిసాన్ అధ్యక్షుడు ముత్యాల మధుసూదన్ రెడ్డి, కె వెంకటాపూర్ ఎంపీటీసీ భాగ్యలక్ష్మి సిద్దరాములు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కాకి రాజయ్య పాల్గొన్నారు.



ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా



నవతెలంగాణ-నర్సాపూర్ : పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నర్సాపూర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఏబీవీపీ ఆధ్వర్యంలో వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏబీవీపీ మెదక్ జిల్లా కన్వీనర్ శశికాంత్ మాట్లాడుతూ ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్‌ను విడుదల చేయకపోవడం వల్ల పేద బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని లేకుంటే ఏబీవీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అయితే ఈ ధర్నా వల్ల ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయి ట్రాఫిక్ స్తంభించి పోవడంతో విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఏబీవీపీ నాయకులతో విద్యార్థులతో మాట్లాడి ధర్నాను విరమింప చేసి ట్రాఫిక్ సమస్యను తీర్చారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి రాహుల్, నగర సంయుక్త కార్యదర్శి అక్షయ్ గౌడ్, నాయకులు సుజిత్ రెడ్డి, కార్తీక్, రంజిత్, గణేష్ గౌడ్, వేణు, తదితరులు ఉన్నారు.

దుబాయ్ గల్ఫ్ కార్మికుడిని రక్షించి స్వదేశానికి తీసుకువచ్చిన ఎమ్మెల్సీ

ఎమ్మెల్సీకి కృతజ్ఞతలు తెలిపిన బాధితుడి కుటుంబం

నవతెలంగాణ-హవేలి ఘనాపూర్

మండల పరిధిలోని శాలిపేట్ గ్రామానికి చెందిన ఎల్ల శ్యామయ్య ఓ ఏజెంట్ మాయమాటలు నమ్మి వర్క్ పర్మిట్ వీసా లేకుండా నిర్మాణ రంగ కంపెనీలో పనిచేయడానికి దుబాయి వెళ్ళాడు. దుబాయి చేరిన స్వల్ప కాలానికే మానసిక అనారోగ్య సమస్యలతో తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలయ్యాడు. ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి బాధితుడి వివరాలతో దుబాయిలోని భారత రాయబార కార్యాలయాన్ని సంప్రదించారు. భారత రాష్ట్ర సమితి ఎన్ఆర్ఐ విభాగం నాయకులను సైతం ఎల్ల శామయ్య ఆచూకీని కనిపెట్టాల్సిందిగా కోరారు. ఎమ్మెల్సీ పట్టు వదలని ప్రయత్నంతో ఎల్ల శామయ్య ఆచూకీ లభించింది. దుబాయి వెళ్లిన రెండు మూడు రోజులే అనంతరం ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ బతుకుతెరువు కోసం దొంగ ఏజెంట్ల మాటలను నమ్మి శాలిపేటకు చెందిన ఎల్ల సామయ్య మోసపోయాడని తెలిపారు. ఆ ఏజెంట్ శామయ్యను



తాత్కాలిక వర్క్ పర్మిట్‌పై పంపి కూలీ పనులలో ఉంచడం జరిగిందన్నారు. శ్యామయ్య తిరిగి దేశానికి రావడానికి కృషి చేస్తున్న ఎమ్మెల్సీ సుభాష్ రెడ్డికి శ్యామయ్య కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు శీను నాయక్, పోశెట్టి, ఉపసర్పంచ్ బయన్న, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చీడపురుగులపై రైతులకు అవగాహన

వ్యవసాయ అధికారి రాజశేఖర్ గౌడ్

నవతెలంగాణ-వెల్దుర్తి



మాసాయిపేట మండల పరిధిలో వ్యవసాయ పంట పొలాలను శుక్రవారం వ్యవసాయ అధికారి రాజశేఖర్ గౌడ్ విస్తీర్ణ అధికారి రజితతో కలిసి పరిశీలించారు. వరి పైరుకు సోకిన చీడపురుగుల బెడదపై రైతులకు అవగాహన కల్పించారు. రైతు పొలంలో కాండం తొలుచు మోగి పురుగును గుర్తించి, దీని నివారణకు క్లోరంట్రా నీలిఫరోల్ 60 ఎం.ఎల్ ఎకరానికి పిచికారి చేసుకోవాలని సూచించారు. లేదా కాట్రా హైడ్రోక్లోరైడ్ 400 గ్రామ్స్ గల ఈ మందునైనా స్ప్రే చేసుకోవడం వలన పురుగు ఉధ్రుతిని తగ్గించుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు ఆగ్రో యజమాని మహేష్ తదితరులు పాల్గొన్నారు.

శివ్వంపేటలో బాగాలాముఖి విగ్రహ ప్రతిష్ఠ మహెూత్సవం

హాజరు కావాలని ఎమ్మెల్యే మదన్ రెడ్డి, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా రెడ్డిలకు ఆహ్వానం

నవతెలంగాణ-నర్సాపూర్



మండల కేంద్రమైన శివంపేటలో నూతనంగా నిర్మించిన బాగాలాముఖి శక్తిపీఠ దేవాలయంలో ఫిబ్రవరి 8, 9, 10, తేదీలలో బాగాలాముఖి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహెూత్సవం నిర్వహించనున్నారు. బాగలాముఖి శక్తిపీఠ దేవాలయ ట్రస్ట్ సభ్యులు వెంకటేశ్వర శర్మ జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తా, హైకోర్టు న్యాయవాది శివకుమార్ గౌడ్, టీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రమణ గౌడ్, జోగినాథ్ గుప్తాలు, శుక్రవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి, వెళ్లి ఎమ్మెల్యే మదన్ రెడ్డిని, మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీత రెడ్డి నివాసానికి వెళ్లి సునీతారెడ్డిని బాగాలాముఖి విగ్రహ ప్రతిష్ఠ మహెూత్సవాలకు రావాలని కోరుతూ కరపత్రాన్ని అందజేసి ఆహ్వానించారు.

వార్షిక బ్రహ్మోత్సవాలకు రావాలని ఎమ్మెల్యేకు, ఆర్డీవోకు ఆహ్వానం

నవతెలంగాణ-చేగుంట



మండలంలోని ఇబ్రాహీంపూర్ గ్రామంలో శనివారం నుంచి జరిగే శ్రీశ్రీ వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవా లకు రావాలని కోరుతూ ఎమ్మెల్యే రఘునందన్ రావుకు, తూప్రాన్ ఆర్డీవో శ్యామ్ సుందర్‌కు ఆలయ ధర్మకర్త కిషన్ రావు దేశ్‌ముఖ్ శుక్రవారం ఆహ్వాన పత్రికలు అందజేశారు. 28వ తేది నుంచి 31వ తేదీ వరకు జరిగే శ్రీ శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొని భగవంతుని కృప కటాక్షాలు పొందాల కోరారు. అదేవిధంగా జిల్లాలోని వివిధ మండలాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బ్రహ్మోత్సవాలు తిలకించాలని వారు కోరారు.

విద్యార్థులకు పెన్సిల్లు, పలకలు, నోట్ బుక్స్ పంపిణీ

నవతెలంగాణ-చేగుంట



చేగుంట మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పలకలు, పెన్నులు, పుస్తకాలు, శుక్రవారం పాఠశాలలో ఎస్బిఐ విశ్రాంతి ఉద్యోగి సత్యనారాయణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం 15 ఆగస్టు, 26 జనవరి పురస్కరించుకొని విద్యార్థులకు వారికి సంబంధించిన వస్తువులను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు యాదగిరి, రాములు, తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి





నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

కంటి వెలుగు కార్యక్రమానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మండల స్పెషల్ ఆఫీసర్, డీపీసీ మేనేజర్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. మండలంలోని కొండాపూర్ గ్రామంలో చేపడుతున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంలో బాగంగా మూడవ కొనసాగుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని మండల స్పెషల్ ఆఫీసర్ డీపీసీ మేనేజర్ కృష్ణమూర్తి పరిశీలించారు. కంటి వెలుగు కార్యక్రమంపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని సూచించారు. కంటి పరీక్షల కోసం వచ్చే ప్రజలకు, వృద్దులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మూడు రోజుల పాటు జరిగిన కంటి వెలుగు కార్యక్రమానికి గ్రామంలో సుమారు 60 శాతం ప్రజలు పాల్గొని పరీక్షలు నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో లక్ష్మినర్సింలు, కార్యదర్శి శ్రీధర్, వార్డు సభ్యులు సత్యనారాయణ, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

నవతెలంగాణ-హవేలి ఘనపూర్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ మంద శ్రీహరి కోరారు. శుక్రవారం తొగిట గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసుకుని ఉచితంగా పరీక్షలను నిర్వహించి, కంటి అద్దాలు, మందులు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. మండల అభివృద్ధి అధికారి శ్రీరామ్, పంచాయతీ కార్యదర్శి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులకు అండగా మంత్రి హరీశ్ రావు



మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డి
నవ తెలంగాణ-సిద్దిపేట

పురపాలక సంఘంలో విధులు నిర్వర్తిస్తున్న కార్మికులకు అండగా మంత్రి హరీశ్ రావు ఉన్నారని, ఆయన ఆదేశాలమేరకు కార్మికులకు 399 కూడిన ఇన్సూరెన్స్ పాలసీ చేపించటం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పురపాలక సంఘం కార్యాలయంలో పని చేస్తున్న అన్ని విభాగాల 468 మంది కార్మికులకు ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంక్ వారిచే ఇన్సూరెన్స్ పాలసీ చేయిస్తున్నామన్నారు. ఈ పాలసీలో ఆక్సిడెంట్ జరిగి మరణం సంభవించినా, పాము కరిచి మరణించినా, గోడ పైన నుంచి, చెట్ల పైన నుంచి పడి మరణించినా ఈ పాలసీ ద్వారా రూ 10 లక్షల బీమా వర్తిస్తాయని తెలిపారు. పక్షవాతం వచ్చి, ఏదైనా ఆరోగ్యపరమైన సమస్యతో మంచం బారిన పడి, లేవలేని స్థితిలో ఉన్న వారి ఇంట్లో చదువుకుంటున్న పిల్లలకు లక్ష రూపాయలు వస్తాయని తెలిపారు. ఈ ఇన్సూరెన్స్ కార్మికులకు ఎంతో ఉపయోగమన్నారు.

వ్యాస రచన పోటీ విజేతలకు బహుమతులు అందజేత



నవతెలంగాణ-వర్గల్

మండలంలోని వేలూరు గ్రామ ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం పరీక్షపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యమానికి బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి, వర్గల్ మండల ఇన్చార్జ్ పూదరి నరసింహా గౌడ్‌లు హాజరయ్యారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో ప్రతిభను కనబర్చిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ అసెంబ్లీ కన్వీనర్ సాయిబాబా, కో కన్వీనర్లు ఎలుకంటి సురేష్, బండారి మహేష్, బీజేపీ వర్గల్ మండల అధ్యక్షులు శ్రీరామ్ శ్రీకాంత్, మండల ఉపాధ్యక్షులు జాలిగామ శంకర్ గౌడ్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు కాగిత రాజు, మండల కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి దిండి నాగరాజు గౌడ్, మండల ఓబీసీ మోర్చా అధ్యక్షులు ఉప్పరి శేఖర్, మండల బీజేవైఎం ఉపాధ్యక్షుడు మహేష్ యాదవ్, మండల పదాధికారులు, మండల సీనియర్ నాయకులు సాయి యాదవ్, జాలిగామ రాజు పాల్గొన్నారు.

కంటి వెలుగుతో పేదల జీవితాల్లో వెలుగు



41 వ వార్డు కౌన్సిలర్ సాయన్న గారికి సదర్
నవతెలంగాణ-సిద్దిపేట

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు పథకం ప్రజల జీవితాల్లో వెలుగును ఇస్తుందని 41వ వార్డు కౌన్సిలర్ సాయన్న గారి సుందర్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్ రావులు చేపట్టిన ప్రతి సంక్షేమ పథకం నిరుపేదలను, బడుగు, బలహీన వర్గాల వారిని దృష్టిలో పెట్టుకొని తీసుకొచ్చిన పథకాలేనని అన్నారు. రెండో విడత కంటి వెలుగు పథకం ద్వారా అనేకమంది నిరుపేదలకు కళ్ళజోడులు కొనుక్కోవలసిన అవకాశం లేకుండా ప్రభుత్వమే ఇస్తుందన్నారు. అవసరమైన వారికి ప్రభుత్వమే కంటి ఆపరేషన్‌లను కూడా చేయింస్తుందన్నారు. కంటి వెలుగు పథకానికి పట్టణంలో మంచి స్పందన వచ్చిందన్నారు. పేదల పక్షాన ఆలోచిస్తున్న మంత్రి హరీశ్ రావుకు ప్రజల తరపున ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పంచకట్టు వేడుకలకు హాజరైన బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ-మర్కుక్

రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ కుమారుల పంచకట్టు వేడుకలను లకుడారంలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డితో కలిసి బీఆర్ఎస్ మర్కుక్ మండలాధ్యక్షులు మర్కుక్ కర్ణాకర్ రెడ్డి, గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మదాసు శ్రీనివాస్, బీఆర్ఎస్ బీసీ సెల్ మండలాధ్యక్షులు మేకల కనకయ్య ముదిరాజ్‌లు హాజరై చిన్నారులను దీవించారు. ఈ కార్యక్రమంలో మర్కుక్ సర్పంచ్ అచ్చంగారి భాస్కర్, గజ్వేల్ సర్పంచుల ఫోరం అధ్యక్షులు చంద్రమోహన్ రెడ్డి, బీఆర్ఎస్ గజ్వేల్ అధ్యక్షులు బెండ మధు, నాయకులు టి.అజయ్ రెడ్డి, పాములపర్తి కర్ణాకర్, పాతూరు మల్లేశం, ప్రవీణ్ పాల్గొన్నారు.

అభయ జ్యోతి మానసిక వికలాంగులకు భోజనం



నవతెలంగాణ-సిద్దిపేట

వాసవి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో అభయ జ్యోతి మానసిక వికలాంగుల పాఠశాల విద్యార్థులకు ఒకరోజు భోజనం అందించారు. యూత్ క్లబ్ అధ్యక్షులు హరి కిరణ్ శుక్రవారం మాట్లాడుతూ తన బాల్యమిత్రుడు బాబు జన్మదిన సందర్భంగా విద్యార్థులకు భోజనం అందించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాకాల సంతోష్, కాసనగొట్టు సంతోష్, స్కూల్ యాజమాన్యం జోజి తదితరులు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో

వాసవి మాత పారాయణం సందర్భంగా వాసవి క్లబ్, అన్నపూర్ణేశ్వరి యూత్ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రి దాల్ రైస్ పంచడం జరిగిందని వాసవి క్లబ్ ప్రెసిడెంట్ చింత రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి చకీలం రవి, కాసన గొట్టు నాగరాజ్, ఇల్లెందుల నాగేందర్ పాల్గొన్నారు.

108 అంబులెన్స్ ను తనిఖీ చేసిన వైద్య బృందం



నవతెలంగాణ-కొండపాక

కొండపాక మండలం 108 అంబులెన్స్ సేవల పనితీరును కేంద్ర వైద్య బృందం శుక్రవారం పరిశీలించారు ప్రజలకు అంబులెన్స్ సేవలు ఎలా అందుతున్నాయో రికార్డులను పరిశీలించారు. ప్రజలకు అందిస్తున్న సేవలను అంబులెన్స్ సిబ్బంది గణేష్, శ్రీనివాస్‌లను అడిగి రికార్డు చేశారు.

పీఏసీఎస్ మాజీ చైర్మన్ కుమారుడి పెళ్లికి హాజరైన ఎంపీ



నవతెలంగాణ-చేగుంట : చేగుంట మండలం ఇబ్రహీంపూర్ గ్రామ పీఏసీఎస్ సొసైటీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నారాయణ రెడ్డి కుమారుడి వివాహ వేడుకలు శుక్రవారం అల్వాల్ ఫంక్షన్ హాల్లో జరిగాయి. వివాహ మహోత్సవానికి మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. చేగుంట ఎంపీపీ మాసుల శ్రీనివాస్, జెడ్పీటీసీ శ్రీనివాస్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు మంచి కట్ల శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్‌లు మేకల పరమేష్, కొండల్ రెడ్డి, సంద్రు గు స్వామి, డైరెక్టర్ అయిత రఘురాములు, సీనియర్ నాయకులు రంగయ్యగారి రాజిరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా



నవతెలంగాణ-టేక్మాల్

ఎల్లమ్మ గుడి ఆలయ నిర్మాణానికి తన వంతు శాయశక్తులా కృషి చేసి అభివృద్ధికి తోడ్పడుతానని నర్సింగ్ రావు దేశ్ పాండే అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని షేర్ పల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఎల్లమ్మ గుడి నిర్మాణానికి, అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఆలయాలు ఆధునిక కేంద్రాలు కావాలని ఆయన చెప్పారు. హిందూ దేవాలయాలను అభివృద్ధి కోసం తన వంతు సహాయంగా రూ.1,016లు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ నిధులను ఆలయ అభివృద్ధి కోసం ఉపయోగించాలని ఆలయ సిబ్బందికి చెప్పారు. విగ్రహ ప్రతిష్ట రోజు అమ్మవారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు పుస్తె మట్టెలు బహుకరించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సత్య గౌడ్, యాద గౌడ్, చంద్ర గౌడ్, చంద్రశేఖర్ రెడ్డి, వార్డ్ మెంబర్లు ఉన్నారు.

యాదగిరి గుట్టకు ప్రత్యేక బస్సు నడుపుతాం

నవతెలంగాణ-గజ్వేల్ : యాదాద్రి లక్ష్మి నరసింహ స్వామి దేవాలయంను దర్శించుకోవడానికి ప్రతిరోజ ఉదయం ఎనిమిది గంటలకు బస్సు సౌకర్యాన్ని కల్పించినట్లు డిపో మేనేజర్ బి .సురేఖ తెలిపారు. గజ్వేల్ బస్టాండ్ నుంచి ఈ బస్సు ఉదయం ఎనిమిది గంటలకు బయలుదేరుతుందన్నారు. ఈ సౌకర్యాన్ని ప్రయాణికులు సద్విని యోగం చేసుకోవాలని కోరారు.

నేడు సామూహిక సూర్యనమస్కారాల సాధన

నవతెలంగాణ-సిద్దిపేట : రథసప్తమిని పురస్కరించుకొని వ్యాసమహర్షి యోగా సొసైటీ ఆధ్వర్యంలో కోమటి చెరువు కట్ట మీద శనివారం ఉదయం 6 నుంచి 7 గంటల వరకు సూర్యభగవానుని స్మరిస్తూ సూర్య నమస్కారాలు చేయడం జరుగుతుందని వ్యాస మహర్షి యోగా సొసైటి అధ్యక్షులు నిమ్మ శ్రీనివాస్ రెడ్డి, సిద్దిపేట జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు తోట అశోక్, యోగా శిక్షకులు తోట సతీష్‌లు తెలిపారు. ఆసక్తి గలవారు వైట్ టీ షర్ట్, మ్యాట్‌తో బోటు పాయింట్ వద్దకు రావాలని కోరారు.

నేడు జాతీయ స్థాయి పరివేక్షణ బృందం పర్యటన

నవతెలంగాణ-తొగుట : ఖమండలంలో జాతీయ స్థాయి పరివేక్షణ బృందం ఎర్యటన చేస్తారని ఎంపీడీవో శ్రీధర్ తెలిపారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ జాతీయ స్థాయి పర్యవేక్షణ (ఎన్ఎల్ఎం) బృందం శనివారం ఉదయం వస్తున్నారని తెలిపారు. మండలంలో జరిగిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన వివిధ రకాల పనులను పరిశీలిస్తారని చెప్పారు. కాన్గల్, తుక్కాపూర్ గ్రామంలో జరిగిన వివిధ అభివృద్ధి పనులు చూడడానికి విచ్చేయనున్నారని ఆయన తెలిపారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి













సిద్దిపేట జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్
నవతెలంగాణ-మద్దూరు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ కోరారు ఈ సందర్భంగా మద్దూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలలో ఉన్న పేద ప్రజల కోసం కంటి వెలుగు కార్యక్రమాన్ని తీసుకువచ్చిందని 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలని ఆయన కోరారు కంటి పరీక్షలకు వచ్చే ప్రజలకు కనీస వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా డిఎం అండ్ హెచ్ ఓ కాశీనాథ్ ఎంపీడీవో శ్రీనివాస్ గౌడ్ సర్పంచ్ జనార్దన్ రెడ్డి పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్వర్లు సిద్దేశ్వర్ సిసి ప్రేమలత పాల్గొన్నారు

నవతెలంగాణ-చేర్యాల : కంటి చూపు సమస్య ఉన్న ప్రతి ఒక్కరు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ సూచించారు. పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు పరీక్షా శిబిరాన్ని శుక్రవారం సందర్శించి పరిశీలించారు. సీఎం కేసీఆర్, ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలో జరుగుతున్న గొప్పకార్యక్రమం కంటి వెలుగు అన్నారు. కంటి చూపు సమస్య ఉన్న ప్రతి ఒక్కరికీ ఉచితంగా పరీక్షలు చేసి అవసరమైన మందులు లేదా రీడింగ్ అద్దాలు అందిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని గ్రామాలు, మున్సిపాలిటీ లో ఉన్న ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకుని కంటి సమస్య లేకుండా చూసుకోవాలన్నారు. ప్రజాప్రతినిధులు, ఎపిఎమ్‌లు, మహిళా సంఘాలు, అంగన్వాడీ బృందాలు, అందరూ సమావేశాలు ఏర్పాటు చేసుకొని కంటి సమస్య ఉన్న ప్రతి ఒక్కరు శిబిరానికి వచ్చే విదంగా చూడాలన్నారు. ఎంపిడివో,ఎంపివో, పంచాయతీ కార్యదర్శులు శిబిరాలకు కావాల్సిన ఏర్పాట్లు చూడాలని, సిబ్బందికి భోజన వసతి కల్పించాలన్నారు. అద్దాలు ఇతర సామాగ్రి వివరాలను ఎప్పటికప్పుడు ప్రోగ్రాం అధికారులు డీఎంఅండ్‌హెచ్‌ఓకు తెలిపి స్టాక్ ఉండేలా చూసుకోవాలన్నారు. ఎలాంటి సమస్యలు ఎదురుకాకుండా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ కాశీనాథ్, మున్సిపల్ చైర్ పర్సన్ అంకుగారి స్వరూప రాణి, కౌన్సిలర్లు ఆడెపు నరేందర్, పచ్చిమడ్ల సతీష్, మున్సిపల్ మేనేజర్ జె.ప్రభాకర్ సిబ్బంది పాల్గొన్నారు.

నవతెలంగాణ-సిద్దిపేట : కంటి వెలుగుకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందని 8 వ వార్డు కౌన్సిలర్ వరాల కవిత సురేష్ అన్నారు. 8 వ వార్డు కాలనీలో ఎన్‌జిఓ కమ్యూనిటీ హాల్‌లో కంటి వెలుగు కేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డితో కలసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 సంవత్సరాల పైబడిన వారందరు కంటి వెలుగు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మంత్రి హరీశ్‌రావు ఆదేశాలమేరకు కంటి వెలుగు పథకం ప్రతి ఇంటికి చేరేలా ఇప్పటికే మెప్మా సిబ్బంది ద్వారా అందరికి కూడా టోకెన్‌లను పంపిణీ చేశామన్నారు. అనంతరం మున్సిపల్ కమీషనర్, వైస్ చైర్మన్ జంగిటి కనకరాజులు 31 వార్డులో కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, నాయకులు, రంజిత్, మహేష్ , ఎల్లారెడ్డి, వనిత, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-జగదేవపూర్ : అంధత్వ నివారణకు ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి అన్నారు. శుక్రవారం బస్వాపూర్ గ్రామంలో కంటి వెలుగును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల కంటిచూపు బాగుండాలన్న లక్ష్యంతో కంటివెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని బృహత్తర పథకాలను తెలంగాణలో ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని 18 ఏళ్ల నిండిన ప్రతి ఒకరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బస్వాపూర్‌లో జరుగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని డీఎల్‌పీఓ వేదావతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి రోజు 150 మందికి తగ్గకుండా కంటి పరీక్షలు చేయాలని వైద్య సిబ్బంది ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ మమత, ఉప సర్పంచ్ అనసూయ, ఎంపిడిఓ శ్రీనివాస్ వర్మ, ఏపిఎం ఆనంద్, వైద్య సిబ్బంది, వార్డు సభ్యులు, ఆశావర్కర్లు, విఓఏలు, గ్రామస్తులు పాల్గొన్నారు

నవతెలంగాణ-చేర్యాల : కంటి చూపు సమస్యలతో బాధ పడుతున్న ప్రతి ఒక్కరికి కంటి చూపును కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని చేర్యాల ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్, చేర్యాల ఏఎంసీ చైర్మన్ సుంకరి మల్లేశం అన్నారు. మండల పరిధిలోని ఆకునూరు గ్రామంలో శుక్రవారం కంటి వెలుగు శిబిరాన్ని కరుణాకర్, మల్లేశం సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోనే ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ అందత్వ నివారణకు ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వారి వెంట ఎంపీడీవో తారిక్ అన్వర్, ఎంపీఓ మహబూబ్ అలీ, సర్పంచ్ చీపురేఖ, ఎంపీటీసీ సుంకరి శ్రీధర్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి పులి బాలయ్య, ఏఎన్ఎం, ఆశ, అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-నంగునూరు : కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా కంటి వెలుగు జిల్లా మానిటరింగ్ అధికారి, జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ సరోజన శుక్రవారం నంగునూరు మండలంలోని మైసంపల్లి, నాగరాజు పల్లి గ్రామాలను సందర్శించారు. గ్రామస్తులకు అందుతున్న కంటి వైద్య సౌకర్యాలపై సిబ్బందిని ఆరా తీశారు. ఆమెతో పాటు ఇంచార్జి ఎంపీడీవో వేణుగోపాల్, పీహెచ్సీ డాక్టర్ ప్రవీణ్, అంజలి రెడ్డి, ఎంపీపీ జాప అరుణాదేవి, సర్పంచులు, అంగన్వాడీ టీచర్, ఆశా వర్కర్లు, హెల్త్ సిబ్బంది, వార్డు మెంబర్లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే సీఎం కేసీఆర్ లక్ష్యం



మెదక్ ఎంపీ, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్ రెడ్డి
నవతెలంగాణ-తొగుట

అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే సీఎం కేసీఆర్ లక్ష్యమని మెదక్ ఎంపీ, సిద్దిపేట జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కొత్త ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పెద్ద మాసాన్ పల్లి వడ్డెర కాలనీలో రూ.5 లక్షల వ్యయంతో నిర్మించతల పెట్టిన వడ్డెర సంఘం కమ్యూనిటీ భవన నిర్మాణం కోసం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని కులాలు, మతాల ప్రజలు సంతోషంగా ఉండాలన్న లక్ష్యంతో సీఎం కేసీఆర్ రాష్టాన్ని అభివృద్ధి చేస్తున్నారన్నారు. తెలంగాణ మోడల్‌ను దేశవ్యాప్తంగా అభివృద్ధి సంక్షేమాన్ని తీసుకురావడం కోసమే సీఎం బీఆర్ఎస్ పార్టీని ఏర్పాటు చేశారన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో విడతల వారీగా అభివృద్ధి కార్యక్రమాలకు నిదులు కేటాయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మెట్టు వరలక్ష్మి స్వామి, ఎంపీటీసీ మాష్టి సుమలత కనకయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంది రాంరెడ్డి, ఉప సర్పంచ్ రాజిరెడ్డి, వార్డు సభ్యులు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, వడ్డెర సంఘం నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సీఎం పేరును నిలబెడతాం



గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి
నవతెలంగాణ-గజ్వేల్

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి, గజ్వేల్ శాసనసభ్యులు కేసీఆర్ పేరును దేశంలోనే నిలబెడతామని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి, మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు అన్నారు. శుక్రవారం మున్సిపల్ పాలకవర్గం పదవీ బాధ్యతలు చేపట్టి మూడు సంవత్సరాలు పూర్తి చేసుకుని సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో ఐదు కోట్లతో లక్ష హరితహారం మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టి రాష్ట్రంలోనే ప్రథమ స్థానం దక్కించుకుందన్నారు. మరో రూ.150 కోట్లతో అండర్ డ్రైనేజీ పనులు పూర్తిచేసుకుని మురికి నివారణకు చర్యలు చేపట్టిందదన్నారు. అంతేకాకుండా మరో రూ.23 కోట్ల నిధులు విడుదల చేసి మట్టి రోడ్ల, గుంతల రోడ్ల నివారణకు చర్యలు చేపట్టిందన్నారు. మున్సిపల్ కమిషనర్ విద్యాధర్, కౌన్సిల్ సభ్యులు చందన రవీందర్, గుంటుకు శిరీష రాజు, భాగ్యలక్ష్మి దుర్గ ప్రసాద్, బొగ్గుల చందు, అర్చన శివకుమార్, బాలమణి శ్రీనివాస్ రెడ్డి. లక్ష్మి కిషన్ రెడ్డి, అల్వాల బాలేష్, గోపాల్ రెడ్డి, అత్తిలి శ్రీనివాస్, ఉప్పల మెట్టయ్య, శ్యామల మల్లేశం, మర్కంటి వరలక్ష్మి కనకయ్య, షహనా సమీర్, కోఆప్షన్ సభ్యులు షరీఫా ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై కానిస్టేబుల్ విష్ణుమూర్తి బదిలీ



నవతెలంగాణ-ములుగు

ములుగు నుంచి కానిస్టేబుల్ గుంజ విష్ణుమూర్తి తొగుటకు సాధారణ బదిలీపై వెళ్తున్నారు. ములుగులో ఆరు సంవత్సరాల నుంచి సేవలందించి మంచి పేరు తెచ్చుకున్న విష్ణుమూర్తిని ఎస్సై రంగకృష్ణ, సిబ్బంది శాలువాతో సన్మానించారు. ఎస్సై రంగాకృష్ణ మాట్లాడుతూ ఉద్యోగంలో బదిలీలు సహజమని ఎక్కడైనా మంచి పేరు తెచ్చుకోవాలన్నారు.

నిరుపేద యువతి వివాహం కోసం పుస్తె మట్టెలు పంపిణీ



నవతెలంగాణ-సిద్దిపేట

37వ వార్డ్‌లోని నిరుపేద యువతి అనిషా వివాహానికి పుస్తె మట్టెలు ఇవ్వడం జరిగిందని కౌన్సిలర్ సాకి బాల్ లక్ష్మి - ఆనంద్ తెలిపారు. మంత్రి హరీశ్ రావు దృష్టికి తీసుకువెళ్లి కళ్యాణ లక్ష్మి పథకం వచ్చే విధంగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వధువు కుటుంబ సభ్యులు రేణుక - శ్రవణ్ కుమార్, సందులపురం శివ, గుడికందుల నరేష్, పర్శరాములు, భయ్యారం యాదగిరి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా కో ఆర్డినేటర్‌గా సిలివేరి అఖిల్ గౌడ్



నవతెలంగాణ-తొగుట

మండల సోషల్ మీడియా కో-ఆర్డినేటర్‌గా నియమించినందుకు చెరుకు శ్రీనివాస్ రెడ్డికి సిలివేరి అఖిల్ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి కాంగ్రెస్ పార్టీ మండల సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ గా తన నియామకానికి కృషి చేసిన రాష్ట్ర సోషల్ మీడి యా కన్వీనర్ నవీన్ పెట్టేం, కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డిలకు, నియోజకవర్గ, తొగుట మండల నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అందరి సహకారంతో తన బాధ్యతను నిర్వహిస్తానన్నారు.

బాట లక్ష్మీ నరసింహస్వామి శాంతి కళ్యాణ మహోత్సవం

నేడు స్వామి వారి కళ్యాణం



నవతెలంగాణ-మర్కుక్

మండల పరిధిలోని గణేష్‌పల్లి గ్రామంలో గల బాట లక్ష్మీనరసింహ స్వామి శాంతి కల్యాణ మహోత్సవము శనివారం అంత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు మోహన్ పంతులు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ శనివారం ఉదయం పంచామృత అభిషేకం, గణపతి పూజ, పుణ్య వచనము, అంకురార్పణ, ధ్వజారోహణ, అగ్ని ప్రతిష్ట, మూల మంత్ర హవనము, హారతి మంత్ర పుష్పము, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వహించారు. శనివారం ఉ,,11 గం,,లకు స్వామి కల్యాణం వేడుకలు నిర్వహించినున్నట్లు ఆయన తెలిపారు. ఈ కళ్యాణ మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

రక్తదానం మహాదానం



నవతెలంగాణ-సిద్దిపేట

రక్తదానం మహాదానమని, ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేస్తే ఒక ప్రాణం నిలబెట్టినట్టు అవుతుందని వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ పుల్లూరి శ్రీనివాస్ అన్నారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఓ పేషెంట్‌కు అత్యవసరంగా రక్తం అవసరం ఉందని తెలువగానే మిత్రుడు మాడుగుల యాదగిరి రెడ్డికి తెలపగానే, రక్తం ఇవ్వడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరు కూడా ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అరుణ, కనకచంద్రమ్, రమేష్ , ఇమ్రాన్, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష చర్చ కార్యక్రమాన్ని వీక్షించిన మున్సిపల్ చైర్మన్



నవతెలంగాణ-నర్సాపూర్

భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో 10వ తరగతి ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న పరీక్షపై చర్చ కార్యక్రమాన్ని నర్సాపూర్‌లోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్‌లో నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళి యాదవ్ 400 మంది శుక్రవారం విద్యార్థులతో కలిసి వీక్షించారు ,ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మురళి యాదవ్ మాట్లాడుతూ, విద్యార్థులు పరీక్షలను ఆత్మవిశ్వాసంతో ఉండి ఒక పండుగలా జరుపుకోవాలని ధైర్యంతో రాయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చెప్పిన చిట్కాలను అందరూ విద్యార్థులు పాటించి పరీక్షల్లో తమ సత్తా చూపించాలని సూచించారు, ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మురళి యాదవ్‌తో పాటు పదో వార్డ్ కౌన్సిలర్ బుచ్చే ష్ యాదవ్, 11వ వార్డు కౌన్సిలర్ గోద రాజేందర్, పాఠశాల ప్రిన్సిపల్ సంగమేశ్వర్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా భరోసా, సపోర్ట్ సెంటర్లు

సీపీ ఎన్.శ్వేత
నవ తెలంగాణ-సిద్దిపేట అర్బన్

లైంగిక దాడులకు గురైన బాధితులకు భరోసా కల్పిండంతో పాటు వారికి సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ భరోసా కేంద్రం, స్నేహిత మహిళా సపోర్ట్ సెంటర్లు పూర్తి సహాయ సహకారాలను అందిస్తున్నాయని సీపీ ఎన్.శ్వేత అన్నారు. శుక్రవారం సిద్దిపేట భరోసా సెంటర్‌లో సిబ్బందితో మహిళల, బాలల రక్షణ, సత్వర సేవలు అందించడానికి తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడైనా పోక్సో, అత్యాచారం కేసులు జరగగానే సంబంధిత బాధితులను నేరుగా భరోసా సెంటర్ కు సంబంధిత అధికారులు తీసుకొని రాగానే చట్ట ప్రకారం వారికి అందించవలసిన సూచనలు సలహాలు తక్షణమే అందించాలని భరోసా సిబ్బందికి సూచించారు. సంబంధిత బాధితులకు ఎవరూ లేనప్పుడు సిద్దిపేట బాలసదన్ లో వారికి ఆశ్రయం కల్పించడం చేయాలన్నారు. భరోసా సెంటర్ సేవల కోసం బాధితులు డయల్ 100 కు గాని, సిద్దిపేట జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ 8333998699 కు గాని ఫోన్ చేసి సహాయ సహకారాలు పొందవచ్చని సూచించారు. ఎవరైనా మహిళలు గృహహింస, కట్నం తదితర అంశాల గురించి వేధింపులకు గురి చేస్తే స్నేహిత మహిళా సపోర్ట్ సెంటర్ 9494639498 నెంబర్ కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఏటీ దుర్గ, భరోసా సెంటర్ సిబ్బంది వినోద, సౌమ్య హరిత, రేణుక, భవాని, స్నేహిత మహిళా సపోర్ట్ సెంటర్ సిబ్బంది వసంత, రామప్రభ, సుష్మ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం



తెలంగాణ-దౌల్తాబాద్

అంబులెన్స్‌లోనే ప్రసవమైన సంఘటన దౌల్తాబాద్ మండలం తిరుమలాపూర్‌లో శుక్రవారం జరిగింది. మల్లేశంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని శౌరిపూర్ గ్రామానికి చెందిన గర్భవతి చెన్న అనిత తల్లిగారి గ్రామం తిరుమలాపూర్‌లో ఉంటోంది. ఆమెకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబీకులు 108 వాహనానికి సమాచారం అందించారు. దౌల్తాబాద్ 108 పైలెట్ నరసింహులు, ఈఎన్‌టీ భాను ఆ గ్రామానికి చెరుకుని ఆమెను వాహనంలో గజ్వేల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో పురిటి నొప్పులు అధికమయ్యాయి. దీంతో సిబ్బంది అంబులెన్స్‌లోనే పురుడుపోశారు. ఆమె ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ప్రస్తుతం తల్లీబిడ్డ గజ్వేల్ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

మొగిపురుగు నివారణకు చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-దుబ్బాక రూరల్

మొగిపురుగు నివారణకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని పద్మనాభునిపల్లి ఏఈవో చైతన్య అన్నారు. దుబ్బాక మండల పరిధిలోని పద్మనాభునిపల్లి, తిమ్మాపూర్ గ్రామాల్లో శుక్రవారం వరి పంట పొలాలను ఏఈవో సందర్శించారు. అనంతరం రైతులకు పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముందుగా నాటు వేసిన వరి పొలాలలో మొగి పురుగు లేదా కాండం తొలచు పురుగు ఆశించినట్టు, కొన్ని పొలాలలో రెల్ల రాల్చు పురుగు సోకిందని గుర్తించామన్నారు. తెగులు నివారణకు రైతులు క్లోరాంత్ర నిలిప్రోల్ గుళికలు 4 కిలోలు ఎకరకు లేదా కార్టాప్ గుళికలు 8 కిలోలు చల్లాలని తెలిపారు. లేనిచో కార్టాప్ హైడ్రో క్లోరైడ్ 400 గ్రాములు అసిఫేట్ 400 గ్రాములతో కలిపి స్ప్రే చేయాలని చెప్పారు. పంటపై రెక్కల పురుగులు గమనిస్తూ తగు చర్యలు తీసుకుంటే పంటలు నష్టపోకుండా ఉంటుందని పేర్కొన్నారు. కార్య క్రమంలో దుబ్బాక వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రుద్రారం లింగం, ఎఫ్ పీ ఓ ప్రతినిధి శ్రీశైలం, తిమ్మాపూర్ రైతు సంఘం సిఈవో యాదగిరి, అధ్యక్షుడు కుకునూరి యాదగిరి, రైతులు యాద గౌడ్, లింగం, పర్శరాములు తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ పార్టీ మండల యువత సమావేశాన్ని విజయవంతం చేయాలి

మండల యువత అధ్యక్షుడు జాలిగం శంకర్



నవతెలంగాణ-కోహెడ

బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ యువత ఆధ్వర్యంలో హుస్నాబాద్‌లో ఈ నెల 29న నిర్వహించనున్న యూత్, సోషల్‌మీడియా, విద్యార్థి విభాగం సమావేశాన్ని విజయవంతం చేయాలని మండల యువత అధ్యక్షుడు జాలిగాం శంకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని సముద్రాల గ్రామంలో బీఆర్ఎస్ యువత అధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల బీఆర్ఎస్ పార్టీ యువత, ఎమ్మెల్యే సతీష్‌కుమార్ అభిమానులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు చాడ శ్రీనివాస్ రెడ్డి, యువత అధ్యక్షులు గొండ ప్రవీణ్, బొల్లం అంజి, బైరి సాంబ, బండి శ్రీకాంత్, కొండం శ్రీకాంత్, ర్యాగటి శ్రీను, సాయిల్లా శ్రీధర్, మౌటం దాసు, నమిలికొండ మహేందర్, చీకట్ల వెంకటేష్, మౌటం నాగరాజు, జాలిగం అజయ్, తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన చెరుకు శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-దుబ్బాక రూరల్

నూతన అక్బర్ పేట భూంపల్లి మండల పరిధిలోని నగరం గ్రామానికి చెందిన నామాల ఎల్లవ్వ-యాదగౌడ్ కూతురు రమ్య-మహేష్ గౌడ్ల వివాహానికి శుక్రవారం దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో చెరుకు వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గాంధారి నరేందర్ రెడ్డి, టీపీసీసీ ఫిషర్మెన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేపాక తిరుపతి ముదిరాజ్, సీనియర్ నాయకులు అబ్బుల బాలాగౌడ్, పాతూరి వెంకటస్వామి గౌడ్, పూజారి నారాయణ, కోనాపురం బాలు యాదవ్, కోరందా రవీందర్ రెడ్డి, శ్రావణ్ గౌడ్,ఉత్తమ్ నరేష్, చాట్లపల్లి బాలగౌడ్, బాస మధు, కర్ణంపల్లి రమేష్ గౌడ్,బాలరాజు, అన్నభోయిన చంద్రశేఖర్, సాగర్ గౌడ్, గాజుల రమేష్, తాల్ల అంజా గౌడ్, షేర్ పల్లి స్వామి, అభిద్, వేల్పుల యాదగిరి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కుకునూరుపల్లి పీహెచ్‌సీని పరిశీలించిన కేంద్ర బృందం

నవతెలంగాణ-కొండపాక

కుకునూరుపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జాతీయ నాణ్యత ప్రమాణాల కమిటీ సభ్యులు శుక్రవారం పరిశీలించారు. జాతీయ నాణ్యత ప్రమాణాల సర్టిఫికేషన్ కోసం పి హెచ్ సి లో అందుతున్న సేవలను పరిశీలించారు. ఆసుపత్రిలోని ఆరు శాఖలలో నిర్వహిస్తున్న పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డులను చూశారు. అలాగే ప్రజలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. 2018లో ఈపిహెచ్ సి కి నేషనల్ హెల్త్ మిషన్ నుంచి నాణ్యత ప్రమాణాలు పాటించిన బెస్ట్ పిహెచ్ సి గా సర్టిఫికేషన్ అందింది . అప్పటి నుంచి సేవలు ఎలా ఉన్నాయి మళ్లీ రెన్యూవల్ కోసం కమిటీ పరిశీలన చేశారు. కమిటీ సభ్యులు ఏ ఎం అంజియాస్ వసంత్, మమత జిన్వాల్ లు సిబ్బందిని అన్ని విషయాలను అడిగి తెలుసు కొని రికార్డు నివేదిక తయారు చేశారు.



చట్టాలపై అవగాహన అవసరం

నవతెలంగాణ-జగదేవపూర్

విద్యార్థులు అపరిచిత వ్యక్తులపై అప్రమత్తంగా ఉండాలని జగదేవపూర్ ఎస్ఐ కృష్ణ మూర్తి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని తిగుల్ గ్రామంలో గల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పోక్సో చట్టం, బాల్య వివాహాల, రోడ్డు భద్రత, సైబర్ నేరాలు, మహిళా భద్రత, ఈవ్‌టీసింగ్, షీటీమ్ ప్రాముఖ్యత గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిటీ పోలీసింగ్ లో భాగంగా బాల్యవివాహాలు చేసుకోవద్దని చేసుకున్నచో ఇద్దరికీ సమస్యలు వస్తాయని, విద్యార్థి దశలో ఉన్నతంగా చదువుకొని మంచి ఉద్యోగాలు సాధించాలని సూచించారు. విద్యార్థునిలు స్కూల్ లో చదువుకునే సమయంలో ఒక గోల్ ఏర్పాటు చేసుకొని దానికి అనుగుణంగా చదువుకోవాలని, చదువుతో పాటు క్రమశిక్షణ కలిగి ఉండి తల్లిదండ్రులను, పెద్దలను, గురువులను గౌరవించాలని తెలిపారు. ప్రతి విద్యార్థి పేదరికాన్ని అధిగమించి విద్యలో రాణించిన్నప్పుడే భవిష్యత్ ఉజ్వలమవుతుందని భావితరాలకు మిరే మార్గదర్శకాలు కావాలన్నారు. విద్యార్థులు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అని ఎవరైనా కొత్త వ్యక్తులు చెప్పే మాయమాటలకు మోసపోవద్దని, సూచించారు. పోక్సో, బాల్య వివాహాల చట్టాల గురించి వివరించారు. మరియు సైబర్ క్రైమ్, షీ టీమ్స్, ఆన్లైన్ మోసాలు, బాల్య వివాహాలు, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, తదితర అంశాల గురించి మరియు చట్టాల గురించి విద్యార్థినివిద్యార్థులకు వివరించారు. ఏదైనా అవసరం ఉంటే డయల్ 100 కు కాల్ చేయాలని సూచించారు. మరియు ఎవరైనా వేధించిన రోడ్డుపై వెళ్లేటప్పుడు



అవహేలనగా మాట్లాడిన ఉద్దేశపూర్వకంగా వెంబడించిన వెంటనే 100 లేదా సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ వాట్స్‌అప్ నెంబర్ 7901100100 లేదా షిటీమ్ వాట్సప్ నెంబర్ 7901640473 ఫోన్ చేసినచో వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఆయిల్ పాం సాగును పరిశీలించిన నార్సింగ్ జడ్పీటీసీ

నవతెలంగాణ-తొగుట

ఆయిల్ పాం సాగుపై రైతులు దృష్టి సారించేలా కృషి చేస్తామని నార్సింగ్ జెడ్పీటీసీ బాణాపురం కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కాన్గల్ గ్రామంలో వైస్ ఎంపీపీ బాసిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి సాగు చేసిన ఆయిల్ ఫాం సాగును ఆయన పరిశీలించారు. పంటను సాగు చేసే విధానంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తుందన్నా రు. ఆయిల్ పాం సాగు చేస్తున్నా రైతులకు ప్రభుత్వం అన్ని విధాలుగా సౌకర్యం కల్పిస్తుందని అన్నారు. ఆయిల్ పాం సాగుతో రైతులకు ఆర్థికంగా మంచి లాభం చేకూరుతుందన్నారు. ఇలాంటి లాభదాయకమైన పంటలను నార్సింగ్ మండలంలో రైతులు సాగు చేసే విధంగా సూచనలు చేస్తామని తెలిపారు. ఆయిల్ పాం సాగుకు నీటి ఎద్దడి, విద్యుత్ ఇబ్బందులు ఉండవని తెలిపారు. సాగు చేసిన మూడు సంవత్సరాలకు ఆయిల్ పాం కోతకు వస్తుందన్నారు. ఐదు నుంచి పది ఎకరాలు, ఆ లోపు భూమి ఉన్న రైతులు ఈ



పంటను సాగు చేసి ఆర్థిక అభివృద్ధి సాధించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బాసిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, జిల్లా నాయకులు మాష్టి కనకయ్య, యువజన విభాగం కోల శ్రీకాంత్ గౌడ్ తదితరులు ఉన్నారు.

గ్రామాభివృద్ధికి తోడ్పాటునందించాలి

బెజ్జంకి క్రాసింగ్,తిమ్మాయిపల్లి అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ శంకుస్థాపన

నవతెలంగాణ-బెజ్జంకి

గ్రామాభివృద్ధికి ప్రజాప్రతినిధులు తోడ్పాటును అందించాలని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బెజ్జంకి క్రాసింగ్, తిమ్మాయిపల్లిలో నూతనంగా నిర్మాణం చేపట్టనున్న గ్రామ పంచాయతీ, మహిళ సంఘాల భవనాలను ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ శంకుస్థాపన చేశారు. తిమ్మాయిపల్లిలో రెడ్డి సంఘ భవన నిర్మాణానికి కృషి చేయాలని పలువురు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేయగా సానుకూలంగా స్పందించారు. అనంతరం మండలంలో పలు వివాహాలకు ఎమ్మెల్యే హజరై వధూవరులను ఆశీర్వదించారు. ఎంపీపీ నిర్మల,జెడ్పీటీసీ కనగండ్ల కవిత,ఎఎంసీ చైర్మన్ రాజయ్య,అయా గ్రామాల సర్పంచులు టేకు తిరుపతి,కవ్వ లింగారెడ్డి,ఎంపీటీసీ మల్లేశం,మండలాధ్యక్షుడు మహిపాల్ రెడ్డి,ఎఎంసీ డైరెక్టర్ దీటీ రాజు, అయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు,బీఆర్ఎస్ అనుబంధ



కమిటీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ కుల సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధికార ప్రతినిధిగా రాజాగౌడ్

నవ తెలంగాణ-రాయపోల్ : బీసీ కుల సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర కార్యవర్గ సమావేశం సిద్దిపేట జిల్లా కేంద్రంలో బీసీ కుల సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు కాటం నరసింహ యాదవ్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీలో పలువురికి స్థానం కల్పించారు. దీనిలో భాగంగానే రాయపోల్ మండలం వడ్డేపల్లి గ్రామానికి చెందిన రాజాగారి రాజా గౌడ్‌కు బీసీ కుల సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఎన్నుకున్నారు. బీసీలలో ఉన్న ఉపకులాలను అందరిని ఏకం చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను చైతన్యం చేస్తూ రాజ్యాధికారం కోసం కలిసికట్టుగా ఉద్యమించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం బీసీ గణన చేపట్టాలని జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ కల్పించాలన్నారు. బీసీల ఐక్యత కోసం పనిచేస్తామన్నారు.

